తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
గురువారం
13 ఆగస్టు 2026

# సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఎస్పీ, అడిషనల్ ఎస్పీలతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్





**సంగారెడ్డి, ఆగస్టు 12(జనంసాక్షి):**
సంగారెడ్డి లో ఈ నెల 15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి కలెక్టర్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్, భద్రతా ఏర్పాట్లు, హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి సీఎం ప్రయాణించే మార్గం, సభా వేదిక, ప్రజల రాకపోకలు, వాహనాల పార్కింగ్, రహదారులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.


జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, సీఎం రూట్, సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ప్రాంతాల్లో భద్రతా చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డితో కలిసి ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 3 లక్షల ఓట్లకుపై ' సర్ 'కత్తెర..!

- సర్వేతో మారనున్న సంగారెడ్డి రాజకీయ లెక్కలు
- జిల్లా వ్యాప్తంగా 79.32 శాతం పూర్తి
- 5 నియోజకవర్గాల్లో భారీ కోత
- ముసాయిదా జాబితా తర్వాతే అసలు పరీక్ష
- అభ్యంతరాలు నిరూపిస్తేనే తుది జాబితాలో చోటు




**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 12(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) రాజకీయ సమీకరణాలను ఒక్కసారిగా మార్చేసే సంకేతాలు కనిపిస్తున్నాయి. ముసాయిదా జాబితాలో ఏకంగా 3 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగిపోవడం జిల్లాలో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 28 వేలకుపైగా ఓట్లు తగ్గగా, పటాన్చెరు నియోజకవర్గంలోనే అత్యధికంగా 1,38,867 పేర్లు గల్లంతయ్యాయి. అధికారుల అంచనా ప్రకారం మరణాలు, చిరునామా మార్పులు, డూప్లికేట్ నమోదులు రెండు ఓట్లు తొలగించడం వంటి కారణాలతో తగ్గాయని చెబుతున్నారు.

ఆగస్టు 17 వరకు అభ్యంతరాలకు అవకాశం ఉండటంతో తుది జాబితాలో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయన్నది ఉత్కంఠగా మారింది. భారీ స్థాయిలో జరిగిన ఈ ఓట్ల కోత రానున్న ఎన్నికల ఫలితాలపై ఎంత మేర ప్రభావం చూపుతుందనే అంశం ఇప్పుడు జిల్లాలో ప్రధాన రాజకీయ చర్చగా మారింది.

*మిగతా 13లో..*

# ఆక్రమణల చెరలో ప్రభుత్వ భూములు.. కదిలిన అధికార యంత్రాంగం!

- ప్రజావాణిలో డి.నాగరాజు ఫిర్యాదు.. తక్షణ చర్యలకు కలెక్టర్‌కు ఆదేశం



**గోపాల్‌పేట, ఆగస్టు 12(జనంసాక్షి):** గోపాల్‌పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాల, దేవాదాయ శాఖ భూముల ఆక్రమణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డి.నాగరాజు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి డా. జి. చిన్నారెడ్డిని కలిసి ఫిర్యాదు అందజేశారు. గోపాల్‌పేటలోని సర్వే నంబర్లు 425, 392, 422లో ఉన్న ప్రభుత్వ, దేవాదాయ భూములు ఆక్రమణకు గురయ్యాయని నాగరాజు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని తెలిపారు. భూములను జిల్లా, మండల సర్వేయర్లతో సమగ్రంగా సర్వే చేయించి, ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు. ఫిర్యాదుపై స్పందించిన డా.జి.చిన్నారెడ్డి తక్షణమే చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ, దేవాదాయ భూములు ప్రజా ప్రయోజనాలకు వినియోగపడేలా వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని నాగరాజు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలను తొలగించి భూములను పరిరక్షించాలని ఆయన కోరారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థుల హాజరు, తరగతి గదులు, వంటగది పరిశీలన
- మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశం



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు12(జనంసాక్షి):** విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, భోజన సదుపాయాలు, పాఠశాల పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ బిజినపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు చేరుకున్న కలెక్టర్ అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలపై ఆరాతీశారు. పాఠశాలకు చేరుకున్న జిల్లా కలెక్టర్ తొలుత తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాభ్యాసం, తరగతుల నిర్వహణ తీరును గమనించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతున్నారా, ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరవుతున్నారా అనే అంశాలను తెలుసుకునేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, వారికి అనుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత పాఠశాల ప్రత్యేక అధికారిపై ఉందని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ పాఠశాలలోని వంటగదిని, అక్కడి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం తయారు చేసే ప్రదేశంలో పరిశుభ్రత, ఆహార పదార్థాల నిర్వహణ, వంటగది పరిసరాల పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహారం తయారీ విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ భోజనం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.మెనూలో పేర్కొన్న ఆహార పదార్థాలను సక్రమంగా అందించడంతో పాటు, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదని ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యమైనదిగా, పౌష్టిక విలువలతో కూడినదిగా ఉండేలా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణ, వంటగది, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు ఎక్కువ సమయం గడిపే పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, వంటగది పరిసరాల్లో అపరిశుభ్రతకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, పాఠశాలలో వారికి అవసరమైన సదుపాయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ లోపాలను గుర్తించిన వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి, భోజన తదితర సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న అంశంపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల అవసరాలను తెలుసుకుని, సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ వెంట బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో కథలయ్య, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నూతన మండల కార్యాలయాలకు స్థల పరిశీలన



- రైతు వేదిక వద్ద రెండు ఎకరాల భూమి గుర్తింపు
- త్వరగా పనులు ప్రారంభించాలని కలెక్టర్‌కు సర్పంచుల వినతి

**చిలప్‌చేడ్, ఆగస్టు12 (జనంసాక్షి):** చిలప్ చేడ్ మండలంలో నూతన ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు మండలంలోని రైతు వేదిక వద్ద రెండు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ తహసీల్దార్, సంబంధిత అధికారులు స్థలాన్ని పరిశీలించినట్లు మండలంలోని పలు గ్రామాల సర్పంచులు తెలిపారు. కార్యాలయాల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు సర్పంచులు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నూతన మండల ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటులో భాగంగా రైతు వేదిక వద్ద రెండు ఎకరాల భూమిని గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో తహసీల్దార్, మండల ప్రజా పరిషత్ తదితర ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేస్తే మండల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ స్థలం నర్సాపూర్–జోగిపేట ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో ప్రజలు, అధికారులు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. అన్ని వసతులతో కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉన్నందున ప్రభుత్వం త్వరితగతిన పనులు ప్రారంభించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

### భూత్పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో
## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్





**భూత్పూర్, ఆగస్టు 12 (జనంసాక్షి):** భూత్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో పారిశుద్ధ్య చర్యలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ బుధవారం పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించిన ఆయన, విద్యార్థులు, ఉపాధ్యాయులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పాఠశాల అధికారులను ఆదేశించారు.పాఠశాల ఆవరణలో ఎక్కడా చెత్త, వ్యర్థ పదార్థాలు పేరుకుపోకుండా చూడాలని, పిచ్చిమొక్కలు, పొదలు, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ముఖ్యంగా పాములు దాగేందుకు అవకాశం ఉన్న పొదలు, చెత్తాచెదారం, ఇతర ప్రదేశాలను పూర్తిగా శుభ్రం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ పాము కాట్ల నివారణకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

- ఆగస్టు 12 నుంచి 31 వరకు దరఖాస్తుల స్వీకరణ



**నాగల్‌గిద్ద, ఆగస్టు12 (జనంసాక్షి):** నాగల్‌గిద్ద మండల కేంద్రంలో ఎంపీడీవో కులకర్ణి మహేష్‌రావు మాట్లాడుతూ, చేయూత పింఛన్ల కోసం అర్హులైన వారు ఆగస్టు 12 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.
కొత్త పింఛన్లకు అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో లేదా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలని ఎంపీడీవో సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బస్వాపూర్ గ్రామంలో "సురక్ష నేత్ర" కెమెరాల ఏర్పాటు



**కోహెడ, ఆగస్టు12 (జనంసాక్షి):** మండలంలోని బస్వాపూర్ గ్రామంలో బుధవారం సురక్షనేత్రలో భాగంగా సీసీ కెమెరాలను కోహెడ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జిల్లాలో నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలన, రోడ్డు భద్రతపై పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తోందని, గ్రామంలో "సురక్ష నేత్ర" కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను స్థానిక సర్పంచ్ బానోతు లింగం నాయక్ తో కలిసి హుస్నాబాద్ ఏసిపి సదానందం ప్రారంభించారు. సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హుస్నాబాద్ ఏసిపి సదానందం గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.
"సురక్ష నేత్ర" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రజల సహకారంతో కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని ఏసిపి తెలిపారు. సీసీ కెమెరా ల వల్ల నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు టోల్ ఫ్రీ నెంబర్ 112కు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఏసీపీ కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండ ధరించాలని, అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణాలను నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పుల్లా అభిలాష్, ఏ ఎం సి చైర్ పర్సన్ బోయిని నిర్మల – జయరాజు, విపిఒ మోహన్, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### గ్రామపంచాయతీ
## కార్మికుడి కుటుంబానికి రూ.5లక్షల బీమా



**సదాశివపేట, ఆగస్టు12(జనంసాక్షి):** విద్యుత్ షాక్‌తో మృతిచెందిన వెంకటాపూర్ గ్రామపంచాయతీ కార్మికుడు బ్యాగరీ ఏ వన్ కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేశారు. మూడేళ్ల క్రితం విధుల్లో ఉండగా బ్యాగరి ఏ వన్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. నిర్మల జగ్గారెడ్డి చొరవతో విద్యుత్‌శాఖ మంజూరు చేసిన బీమా మొత్తాన్ని బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు నిర్మల జగ్గారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, వెంకటాపురం గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, విద్యుత్ అధికారులు డిఈ నెహ్రూ నాయక్, ఏడి వీరారెడ్డి, ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**టేక్మాల్, ఆగస్టు 12(జనంసాక్షి):** టేక్మాల్ రైతు వేదికలో తహసిల్దార్ తులసిరామ్ ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ సహకారంతో టేక్మాల్ మండలానికి మంజూరైన 69,08,004 విలువైన 69 కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి, మంత్రి దామోదర రాజనరసింహ కి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో టేక్మాల్ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్, సంగమేశ్వర్ గౌడ్, మజర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుపీఠంలో మరోసారి చోరీ



**శివ్వంపేట, ఆగస్ట్ 12 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం గూడూరులో ఉన్న శ్రీ గురుపీఠం పంచాయతన దత్తాత్రేయ స్వామి, షిరిడి సాయి బాబా దేవాలయాల్లో మరోసారి చోరీ జరగడంపై స్థానికంగా కలకలం రేపుతుంది. ఇదే దేవాలయాల్లో జులై 31న చోరీకి జరుగగా తిరిగి 12 రోజుల వ్యవధిలోనే గుర్తు తెలియని దుండగుడు మరోసారి చోరీకి పాల్పడటం ఈ చోరీ ఘటన ఇటు పోలీసులకు, అటు భక్తులకు, గురుపీఠం నిర్వాహకులకు విస్మయానికి గురి చేస్తుంది. బుధవారం తెల్లవారుజామున గుడిలోకి ప్రవేశించిన గుర్తు తెలియ వ్యక్తి ప్రవేశించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదై ఉన్నాయి. దుండగుడు ప్రధాన గేటు తాళం, రెండు ఆలయాల్లో గర్భ గుడిల తాళాలు, రెండు హుండీల తాళాలు ఇనుప రాడ్డుతో ధ్వంసం చేశాడు. హుండీల్లో ఉన్న నగదు తీసుకొని ఆ హుండీలను దేవాలయం ప్రహరీ బయట చింత చెట్టు కిందకు తీసుకెళ్లి పడేశాడు. ఆ గుర్తు తెలియని ఆ వ్యక్తిని ఎవ్వరూ గుర్తుపట్టకుండా ముఖానికి మాస్కు ధరించి చోరీకి పాల్పడ్డాడు. ఈ గురుపీఠంలో సీసీ కెమెరాలున్నా వరుస చోరీలు జరుగడం దొంగలు దొరకక పోవడంతో స్థానికంగా అలాగే పోలీసులకు కలవరం రేపుతుంది. వీలైనంత త్వరగా దర్యాప్తు ముమ్మరం చేసి నిందితులను గుర్తించాలని శ్రీ గురుపీఠం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ జిన్నారం పెద్ద గౌని శివకుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## యూరియా కోసం రైతుల దీనావస్థ.. సిబ్బంది కాళ్లు మొక్కిన అన్నదాత!

- ఒక్క యూరియా సంచి ఇవ్వండి అంటూ వేడుకోలు...
- స్మార్ట్‌ఫోన్ లేక బుకింగ్ చేయలేక కన్నీటి పర్యంతమైన రైతు..



**కొల్చారం, ఆగస్టు12 (జనంసాక్షి):** యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులకు అద్దం పట్టే ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద బుధవారం చోటుచేసుకుంది. యూరియా సంచి కోసం వచ్చిన ఓ రైతు.. అక్కడి సిబ్బంది కాళ్లు మొక్కుతూ "అయ్యా.. నాకు అన్నం పెట్టమని అడగడం లేదు.. నీ కాళ్లు మొక్కుతా.. నాకు ఒక్క యూరియా సంచి ఇవ్వండి" అంటూ వేడుకున్న ఘటన అక్కడున్న రైతుల హృదయాలను కలచివేసింది.
మరోవైపు చిట్కుల గ్రామానికి చెందిన బోయిని రాములు అనే రైతు యూరియా కోసం సహకార సంఘానికి వచ్చి తన వద్ద స్మార్ట్‌ఫోన్ లేదని, ఫోన్‌లో యూరియా బుక్ చేసుకోవడం కూడా తెలియదని ఆవేదన వ్యక్తం చేశాడు. "సార్.. నా దగ్గర చిన్న ఫోన్ మాత్రమే ఉంది. నేను యూరియా ఎలా బుక్ చేసుకోవాలి? ఎవరైనా నాకు సహాయం చేయండి" అంటూ కన్నీటి పర్యంతమయ్యాడు.
తనకు ఇద్దరు కూతుళ్లు మాత్రమే ఉన్నారని, తనకు ఎవరూ తోడుగా లేరని రాములు ఆవేదన వ్యక్తం చేశాడు. సాంకేతిక పరిజ్ఞానం లేని, స్మార్ట్‌ఫోన్ సౌకర్యం లేని రైతులు యూరియా బుకింగ్ విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి...**

రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని యూరియా బుకింగ్ కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను కోరారు. స్మార్ట్‌ఫోన్ వినియోగం తెలియని రైతులకు అధికారులు, సిబ్బంది సహకరించి యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పరిస్థితులు మరోసారి తలెత్తకుండా జిల్లా, మండలస్థాయి అధికారులు స్పందించి రైతులకు సులభంగా యూరియా అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వివిధ గ్రామాల రైతులు కోరారు.

# ఉద్యోగ మేళను సద్వినియోగం చేసుకోండి

- **ఉద్యోగ మేళాతో యువతకు ఉద్యోగ అవకాశాలు**
- **ఈ నెల 14న సంగారెడ్డిలో జాబ్ మేళా**
- **జిల్లా ఉపాధి అధికారి రవికిరణ్ రెడ్డి**

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు12 (జనంసాక్షి):** ఉద్యోగ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి రవి కిరణ్ రెడ్డి సూచించారు. సంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ ఉద్యోగ మేళా ఆగస్టు 14న ఉదయం 10:30 గంటలకు సంగారెడ్డిలోని ఐటిఐ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగ మేళాలో వివిధ ప్రైవేట్ కంపెనీల హెచ్ ఆర్ ప్రతినిధులు పాల్గొని అర్హత కలిగిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారని తెలిపారు. ఉద్యోగ మేళాలో ప్రముఖ సంస్థల ద్వారా మొత్తం 122 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, ఇందులో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్‌లో 72, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో 20, ఫ్లిప్కార్ట్‌లో 30 ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో పదవ తరగతి నుండి డిగ్రీ వరకు విద్యార్హతలు గల వారందరికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, బయోడేటా/రెజ్యూమ్ తదితర అవసరమైన పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఉద్యోగ మేళాకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేరుగా, సంప్రదించవచ్చని, లేదా ఫోన్ నంబర్ 08455-271010కు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

## తిమ్మాపూర్ అభివృద్ధికి మరో అడుగు

# ఎంపీ నిధులతో అండర్ డ్రైనేజీ, సిసి రోడ్డు పనులకు శ్రీకారం

**నాగలిగిద్ద, ఆగస్టు 12(జనంసాక్షి):** మానూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ నిధులతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను బుధవారం రోజు గ్రామ సర్పంచ్ గిర్మజె కస్తూరి బాయి గోరక్ పటేల్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ సహకారంతో తిమ్మాపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.




గ్రామంలో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యంతో పాటు పారిశుద్ధ్య పరంగా కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సర్పంచ్ తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం పట్ల సర్పంచ్‌కు, ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కమలాపూర్ గ్రామ యువనేత దత్తు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కూలీల కుటుంబాలను ఆదుకోవాలి

- **క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**



**సంగారెడ్డి, ఆగస్టు 12(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామం వద్ద నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కూలీల కుటుంబాలని తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కూలీల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి వెళుతుంటే నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 9మంది చనిపోయారు. చనిపోయిన 9మంది కూలి కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే 10 లక్షల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో ట్రీట్మెంట్ పొందుతున్న కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కూలీల కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కూలీలకు అండగా నిలబడాలని అన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- **నారాయణఖేడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నిరసన**



**నారాయణఖేడ్, ఆగస్టు 12 (జనంసాక్షి):** పాఠశాలల, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (ఖ్యూజ) ఆధ్వర్యంలో నారాయణఖేడ్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో దశ పోరాటంలో భాగంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు తహసీల్దార్ చంద్ర మోహన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఖ్యూజ నాయకులు జ్ఞాన మంజరి, అశోక్, బాబురావు, కాశీనాథ్ జాదవ్, సిహెచ్ విఠల్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, పాఠశాలలకు సంబంధించిన అనేక సమస్యలు చాలాకాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వెంటనే PRC నివేదికను ప్రకటించి 01-07-2023 నుంచి అమలు చేయాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఆరు విడతల ణాను విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

2003 DSC ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, జ్యూను రద్దు చేసి ౹్యూను పునరుద్ధరించాలని కోరారు. ప్రతి పాఠశాలకు అవసరమైన సంఖ్యలో ఉపాధ్యాయులను నియమించాలని, అశాస్త్రీయంగా ఉన్న GO25ను రద్దు చేయాలని, KGBV, URS, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే గురుకులాలన్నింటినీ ఒకే డైరెక్టరేట్ పరిధిలోకి తీసుకురావాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ అమలు చేయాలని, 2016 వేసవిలో మధ్యాహ్న భోజన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంబంధిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. DSC-2002 అన్‌ట్రెయిన్డ్ ఉపాధ్యాయుల CPS డిడక్షన్లను ZPGPFకు బదిలీ చేయాలని, స్థానికత కోల్పోయిన 317 GO బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తమ సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని, లేకపోతే ఆగస్టు 19న జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు, ఆగస్టు 29న హైదరాబాద్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో నిరసన కార్యక్రమం చేపడతామని నాయకులు హెచ్చరించారు.

కార్యక్రమంలో TSUTF, TPTF ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నరేష్ స్వామి, హరి సింగ్, గోవింద్, ఏసుదాస్, జావిద్, మహేష్ కుమార్, దీపక్ కుమార్, కిష్టయ్య, పరుశురాం, సంగయ్య, అయాజ్, నందు, సిద్ధయ్య స్వామి, రవి కుమార్, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, గాలప్ప, శ్రీనివాస్, శశికళ, అనిత, రాధిక, శోభ, వజ్రవ్వ, వీరలక్ష్మి, రమాదేవి, నాగరాణి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు యువత చేతిలో.. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

- **పటాన్చెరులో ఘనంగా తిరంగా యాత్ర**

**పటాన్చెరు, ఆగస్టు 12(జనంసాక్షి):** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని..యువత శక్తిని సక్రమమైన మార్గంలో వినియోగించినప్పుడే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

దేశభక్తి, జాతీయ సమైక్యత, యువతలో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో యువజన వికాస సమితి ఆధ్వర్యంలో.. పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన తిరంగా యాత్ర కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై.. ప్రారంభించారు. జాతీయ జెండాలను చేతబూని పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, ప్రజలు ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో పటాన్చెరు వీధులు మార్మోగాయి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. విద్య, క్రీడలు, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో యువత రాణిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు.

**మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి...**

డ్రగ్స్ నియంత్రణ కేవలం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసు శాఖతో పాటు ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించి డ్రగ్స్ నిర్మూలనకు




సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయ్ కాడి విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, బల్వంత్, హమీద్, ధనరాజ్, షకీల్, కొండల్, టింకు, యువజన వికాస సమితి అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ గౌడ్, యువత, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కోసం 17న బీఎంఎస్ ధర్నా



**సదాశివపేట, ఆగస్టు 12(జనంసాక్షి):** కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఈ నెల 17న జిల్లా కేంద్రాల్లో బీఎంఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి నర్సింలు తెలిపారు. బుధవారం నంది కంది బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో లిమిటెడ్‌లో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా కనీస వేతనం రూ.30 వేలకు పెంచాలని, ఈఎస్ఐసీ, ఈపీఎఫ్ వేతన పరిమితులను పెంచాలని, ఈపీఎస్ కనీస పెన్షన్‌ను రూ.7,500కు పెంచి డీఏ, వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, జీడీఎస్‌ల రెగ్యులరైజేషన్, గ్రాట్యుటీ పరిమితి పెంపు, గిగ్‌వర్కర్లు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టాలని కోరారు. కార్మిక వ్యతిరేక నిబంధనలను సవరించి, చట్టాలను ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మరిన్ని ఆందోళనలు చేపడతామని నర్సింలు హెచ్చరించారు.

# గోడలేని బడి.. గండంగా విద్యార్థుల భద్రత..!

- **గాధిర్యాల్ పాఠశాల విద్యార్థులకు భద్రత ఎక్కడ..**
- **నిత్యం పాఠశాల ప్రాంగణంలో వాహనాల రాకపోకలు..**
- **130 మంది విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన..**

**మహమ్మదాబాద్, ఆగస్టు12(జనంసాక్షి):**
మండలంలోని గాధిర్యాల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో నిత్యం వాహనాలు ప్రాంగణంలో తిరుగుతుండటం విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. పాఠశాలలో సుమారు 130 మంది విద్యార్థులు చదువుకుంటున్నప్పటికీ వారి భద్రతకు కనీస రక్షణ చర్యలు లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తుండగా.. మరోవైపు పాఠశాల ప్రాంగణంలో వాహనాల రాకపోకలతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ప్రాంగణంలో విద్యార్థులతో పాఠశాల ప్రాంగణం మొత్తం రద్దీగా ఉంటుంది. అ సమయంలో వాహనాలు తిరుగుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగే వరకు గ్రామస్తులు నాయకులు వేచిచూస్తారా అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల చుట్టూ.. వెంటనే కాంపౌండ్ వాల్ నిర్మించి విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలని కోరుతున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో గ్రామస్తులు ఇకనైనా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామస్తులంతా కలిసి ఐక్యమతంతో విద్యార్థుల భద్రత కొరకు ముందడుగువేసి ఈ పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.

**పాఠశాలకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం...**
పాఠశాల చుట్టూ ముట్టు కాంపౌండ్ వాల్ నిర్మిస్తే.. 130 విద్యార్థుల నుండి 200 వరకు విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. తల్లిదండ్రులు ప్రవేట్ పాఠశాలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలకు వారి పిల్లల్ని పంపించే అవకాశం కనిపిస్తుంది. గ్రామంలో ఉన్న పాఠశాలలో విద్యార్థులకు భద్రత లేకపోవడంతోనే తమ పిల్లలను ప్రవేట్ పాఠశాలకు పంపిస్తున్నట్లు సమాచారం.




**గతంలోనే పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలనుకున్నాం..**
పాఠశాల విద్యార్థుల భద్రత కోసం గతంలోనే 8,లక్షల నిధులతోనే పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించడానికి సిద్ధమయ్యామని,మాజీ సర్పంచ్ పివెంకట్రాంరెడ్డి తెలిపారు. గ్రామంలో ఐక్యత లేకపోవడంతో పాఠశాల విద్యార్థులకు భద్రత లేకుండా పోయింది. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు ప్రమాదాలు జరగకుండా గ్రామ పెద్దలంతా కలిసి. పార్టీలకు అతీతంగా విద్యార్థుల భవిష్యత్తుపై నిఘపెట్టి విద్యార్థుల భద్రత కొరకు కాంపౌండ్ వాల్ నిర్మించాలి.



**- పి.వెంకట్రామ్ రెడ్డి,**
**గాధిర్యాల్, మాజీ సర్పంచ్**

## మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



**గుమ్మడిదల, ఆగస్టు 12 (జనంసాక్షి):**
గుమ్మడిదల మండలం కానుకుంట-1 గ్రామంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు పూజ ఆధ్వర్యంలో గ్రామ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో వ్యక్తిగత పొదుపు ఆవశ్యకత, భవిష్యత్ అవసరాల కోసం పొదుపు చేసుకోవడం, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (PMJJBY), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (PMSBY) వంటి బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి సభ్యురాలు బీమా చేయించుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు కూడా బీమా సౌకర్యం కల్పించేలా చూడాలని ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ రాఘవేంద్ర సూచించారు. మహిళలు పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని, బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం పాలకవర్గ సభ్యులతో పాటు ఏపీఎం నరేందర్, సీసీ వరలక్ష్మి, వీఓఏ కల్పన, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆగస్టు 31న మాలల చలో సెక్రటేరియట్

- **మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ**

**చేర్యాల, ఆగస్టు12(జనంసాక్షి):**
మాలల సమస్యలపై ఆగస్టు 31న మాలల చలో సెక్రటేరియట్ చేర్యాల పట్టణ కేంద్రంలో జాతీయ మాల మానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ అనంతరము గ్రూప్ 3లో ఉన్న మాల దాని అనుబంధ 25 కులాలకు విద్య, ఉద్యోగాలలో ప్రమోషన్లలో తీవ్ర అన్యాయం జరిగిందని, ముఖ్యమంత్రి మాలల భవిష్యత్తును నాశనం చేస్తున్నాడని అన్నారు. ఎస్సీ రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులకు తీవ్ర అన్యాయము జరుగుతుందన్నారు. ఇప్పటివరకు ప్రకటించిన 14 జాబ్ నోటిఫికేషన్ లో ఎస్సీ గ్రూపు 3 లోని మాల అనుబంధ కులాల విద్యార్థులకు ఒక పోస్టు కూడా రావడం లేదని అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు మాలల వ్యతిరేక ప్రభుత్వము ముఖ్యమంత్రి ఈ నిరంకుశ విధానాలను తెలుడానికి మాలల విద్య , ఉద్యోగ అవకాశాలను గండి కొడుతున్న సందర్భంగా ఈ నెల ఆగస్టు 31న సెక్రటేరియట్ ముట్టడికి ముట్టడికి మాలలు అధిక సంఖ్యలో రావాలని కోరారు.



# పీఆర్సీని తక్షణమే ప్రకటించి.. అమలు చేయాలి

- **ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి**
- **తహసీల్దార్‌కు యూఎస్‌పీసీ వినతిపత్రం**

**నర్సాపూర్, ఆగస్టు 12(జనంసాక్షి):**
ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో నర్సాపూర్ మండల తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా యూఎస్‌పీసీ నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించి 01-07-2023 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయడంతో పాటు ఉద్యో గులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలను వెంట నే చెల్లించాలని కోరారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.
పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులతో పాటు యూఎస్‌పీసీ నాయకులు రవి, గంగాధర్‌రావు, రమేష్ రాజు, చంద్రశేఖర్, అనిల్, శ్రీనివాస్, మొయినుద్దీన్, నాగభూషణం, సత్యనారాయణ, అప్పలనాయుడు, శంకర్, సర్వేష్, వస్రం, ఆంజనేయులు, కళారాములు, నాగరాజు, రాంబాబు, యోగి, ముకుందరావు, సూర్యారావు, కిశోర్, శ్రీహర్షారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెరుగుతున్న ధరలను నియంత్రించలేని కేంద్ర ప్రభుత్వం

- **సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తాజుద్దీన్**

**సదాశివపేట, ఆగస్టు 12(జనంసాక్షి):**
కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో విఫలమైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. తాజుద్దీన్ అన్నారు. ప్రజల కోసం... ప్రజలతో కలిసి... ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ ప్రచార యాత్ర లో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఆగస్టు 6 నుండి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార ప్రచార యాత్రను బుధవారం సదాశివపేట పట్టణ లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం తాజుద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతు-కూలీల సమస్యలు, విద్యా - వైద్యం పేదలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు, ఎన్నికల్లో ధన ప్రభావాన్ని ప్రలోభాలను అరికట్టి స్వచ్ఛమైన ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికి ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థుల ఖర్చులను ప్రభుత్వమే భరించాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రచార విధానాన్ని మారుస్తూ ప్రచారాన్ని కేవలం ప్రసార మాధ్యమాల ద్వారా చేయుటకు చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. దేశ పరిపాలన వ్యవస్థలో మార్పు రావాలని సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి వేలాది మంది పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ షఫీ ,ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప,పాండు, సాదిక్ అలీ.ముస్తాఫా. యాక్యూబ్ శ్రీనివాస్ నాయక్, పూలమ్మ, ఎం. గంగమ్మ , టీ.బుజమ్మ, దేవి, బిపాషా, రాజమ్మ, రహిమా, రఫీ తదితరులు పాల్గొన్నారు.




# గ్రంథాలయ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

- **బీవీఆర్‌ఐటీలో ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం**
- **ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే**

**నర్సాపూర్, ఆగస్టు 12 (జనంసాక్షి):** విద్యార్థుల విజ్ఞాన సముపార్జన, అకడమిక్ అభివృద్ధిలో గ్రంథాలయం కీలక పాత్ర పోషిస్తుందని బి.వి.రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్‌ఐటీ) ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే అన్నారు. గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డా. ఎస్.ఆర్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని బుధవారం బీవీఆర్‌ఐటీ సరస్వతి బ్లాక్‌లోని సెంట్రల్ లైబ్రరీలో 134వ జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సంజయ్ దూబే మాట్లాడుతూ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఈ-వనరులు, ఇతర సమాచార వనరులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయం అభివృద్ధి చెందితే జ్ఞానసమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డా. కె.లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి గ్రంథాలయం ముఖ్యమైన ఆధారమన్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞాన, సాహిత్య పుస్తకాలను చదవడం ద్వారా జ్ఞానం, ఆలోచనా విధానం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని తెలిపారు. మంచి పుస్తకం మనిషికి మంచి మిత్రుడిగా నిలుస్తుందని, పుస్తక పఠనం ఉన్నతమైన ఆలోచనలకు, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని చెప్పారు. డీన్-ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డా. బంగారు రాజు మాట్లాడుతూ మంచి పఠన అలవాట్లు, సమయపాలన, నిరంతర అభ్యాసం విద్యార్థుల విజయానికి దోహదపడతాయని అన్నారు.



అకడమిక్ విద్యతో పాటు ప్లేస్‌మెంట్ శిక్షణకు విద్యార్థులు ముందుగానే సన్నద్ధం కావాలని సూచించారు. ఈసీఈ విభాగాధిపతి డా. సంజీవ రెడ్డి, ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. పి. విష్ణు మాట్లాడుతూ విద్యార్థులు పఠనాన్ని రోజువారీ జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. లైబ్రేరియన్ డా.ఎ. మల్లికార్జున మాట్లాడుతూ బీవీఆర్‌ఐటీ సెంట్రల్ లైబ్రరీలో అధునాతన పుస్తకాలు, అంతర్జాతీయ జర్నల్స్, ఈ-బుక్స్, పరిశోధనా ప్రచురణలు, GATE, సివిల్స్, ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ పుస్తకాలు, డిజిటల్ లైబ్రరీ, కిండిల్ ఈ-బుక్స్, ప్రింట్ జర్నల్స్, మ్యాగజైన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం గ్రంథాలయ సేవలు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు లైబ్రరీ సిబ్బంది వాణి, రవి నాయక్, ఎస్. రాజు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ బి.బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్ రహదారి విస్తరణకు మరోసారి ఎంపీ షెట్కార్ గట్టి ప్రయత్నం

• రహదారి విస్తరణకు కేంద్రమంత్రి గడ్కరీకి రిమైండర్ లేఖ



**నాగల్గిద్ద, ఆగస్ట్ 12(జనంసాక్షి):** పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మరోసారి కీలక ప్రయత్నం చేశారు. తెలంగాణ సరిహద్దు నుంచి బీదర్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ఎన్హెచ్ -161(బి) జాతీయ రహదారిలో నారాయణఖేడ్ పట్టణ పరిధిలో మిగిలిపోయిన రహదారి విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రిమైండర్ లేఖ రాశారు.

నిజాంపేట్-నారాయణఖేడ్-బీదర్ రహదారి విస్తరణ పనులు ఇతర ప్రాంతాల్లో కొనసాగుతున్నప్పటికీ, నారాయణఖేడ్ పట్టణ పరిధిలోని 4.50 కి.మీ. నుంచి 8.00 కి.మీ. వరకు గల సుమారు 3.50 కి.మీ. రహదారి ప్రస్తుత ప్రాజెక్టులో చేర్చకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ లేఖలో వివరించారు.

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోరకు పట్టణంలో రహదారి ఇరుకుగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడటంతో పాటు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రద్దీ కారణంగా ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఈ రహదారి విస్తరణ అత్యవసరమని ఎంపీ పేర్కొన్నారు. మిగిలిపోయిన రహదారి భాగాన్ని కూడా ప్రస్తుత ప్రాజెక్టులో చేర్చి విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ పనులు పూర్తయితే నారాయణఖేడ్ పట్టణ ట్రాఫిక్ సమస్యకు గణనీయమైన పరిష్కారం లభించడంతో పాటు తెలంగాణ-కర్ణాటక మధ్య రవాణా మరింత సులభతరం అవుతుందని వివరించారు.

ప్రజా ప్రయోజనాల కోసం నిరంతర ప్రయత్నం గతంలో తాను చేసిన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనను పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించినందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ షెట్కార్ కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో సాంకేతిక పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, మిగిలిన రహదారి విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించాలని మరోసారి కోరారు.

## ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ వేడుకలు

• హాజరైన మాజీ ఎమ్మెల్యే చాడ



**కోహెడ, ఆగస్టు 12(జనంసాక్షి):** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ వేడుకలకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించిన మాజీ హుస్నాబాద్ శాసనసభ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా పరిరక్షణ కార్పొరేటీకరణను నిరోధించి, ఉచిత సమగ్ర విద్యను అందించాలని, శాస్త్రీయ విద్య, కామన్ విద్యా విధానం విద్యార్థుల సమస్యల తక్షణ పరిష్కారం.సమానత్వ సమాజం విద్య ద్వారా సామాజిక సమానత్వాన్ని సాధించాలన్నారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశం లో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయాన్నారు. సామాన్యులు బతకడం చాలా ఇబ్బందిగా మారింది.అలాగే నీట్ పేపర్ లీక్ చేసి ఎందరో మంది విద్యార్థులు జీవితాలు నాశనం చేసిన బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం అని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కనుకుట్ల శంకర్ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, జాగీరి సత్యనారాయణ హుస్నాబాద్ నియోజకవర్గ కార్యదర్శి, గడిపే మల్లేష్ జిల్లా సహాయ కార్యదర్శి, కిష్టాపురం లక్ష్మణ్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, గూడ పద్మ మహిళా సమైక్య అధ్యక్షురాలు జనగాం రాజ్‌కుమార్ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు, వెల్పుల శ్రీనివాస్ సిపిఐ తదితరులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి ఆశయాల కోసం కృషిచేయాలి

• సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య

**కొండపాక, ఆగస్టు 12(జనంసాక్షి):** కొండపాక మండలం వెల్‌కట్ట గ్రామంలో సీపీఎం అఖిలభారత మాజీ ప్రధాన కార్యదర్శి, అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి 74వ జయంతి సందర్భంగా మండలంలోని వెలికట్ట గ్రామం సీపీఎం శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండలం కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకుడని మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాలపై అచంచల విశ్వాసంతో, కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాడారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం పరిరక్షణ కోసం సీతారాం ఏచూరి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.

దేశంలో మతతత్వ శక్తులు బలపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సీతారాం ఏచూరి చూపిన మార్గంలో ప్రజలను ఐక్యం చేసి, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సభ్యులు కొమురవెల్లి కనకయ్య, అమ్ముల పర్శరాములు, అమ్ముల సాయిలు, భాను, రంజిత్ తదితరులు పాల్గొన్నారు

## పేట గ్రామపంచాయతీ ఆదాయానికి గండి కొట్టిన పంచాయతీ కార్యదర్శి రాజు

• నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా 21 షట్టర్లు
• 2000 గజాల ఖాళీ స్థలానికి 23 ఇంటి నెంబర్లుకు 637 రూపాయలకు ఇచ్చిన ఈవో...
• పెద్దశంకరపేట సర్పంచ్ జంగం రేణుక




**పెద్ద శంకరంపేట, ఆగస్టు 12 (జనంసాక్షి):** మేజర్ గ్రామపంచాయతీ అయిన పెద్ద శంకరంపేట పంచాయతీ కార్యదర్శి విధులలో ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని. కనీసం సర్పంచ్ కు సమాచారం ఇవ్వకుండానే అనుమతులను ఇస్తున్నారని పెద్ద శంకరంపేట సర్పంచ్ జంగం రేణుక పేర్కొన్నారు. బుధవారం పెద్ద శంకరంపేటలోని ఆమె నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఇంటికి పర్మిషన్లు తీసుకొని 21 సెటర్ల కు నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు కేటాయించారని వెల్లడించారు. అంతేకాకుండా నంబర్ల వెనుక భాగంలో సుమారు 2000 గజాల స్థలంలో ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా ఇంటి నెంబర్ లు కేటాయిస్తూ సర్పంచ్‌కు కనీసం సమాచారం సైతం ఇవ్వకుండా ఇంటి నెంబర్లను పంచాయతీ కార్యదర్శి ఇచ్చారని వివరించారు.. నిబంధనలకు విరుద్ధంగా ఎలా అనుమతులు ఇచ్చారని పంచాయతీ కార్యదర్శిని అడగగా తనను ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తామంటూ పంచాయతీ కార్యదర్శి హెచ్చరిస్తున్నాడని సర్పంచ్ ఆరోపించారు. ఖాళీ స్థలంలో డిటిసిపి అనుమతులు లేకుండా ఈవో ఇంటి నెంబర్లు కేటాయించారని విమర్శించారు. కేవలం 637 రూపాయలతో 23 నిర్మాణాలకు పరిమిషన్ ఇవ్వడంతో గ్రామపంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని పేర్కొన్నారు. ఈవో కనీసం సర్పంచ్ కు మర్యాద కూడా ఇవ్వడం లేదని ఈ విషయమై మండల జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేసినట్లు పేర్కొన్నారు. పెద్ద శంకరంపేట ఈవోగా రాజు తీసుకున్న 2.5 నెలల కాలంలో పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా ఇంటి నంబర్ల కేటాయింపుపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈవో తీరుపై తీవ్ర సంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు ప్రస్తుత ఈవోను తొలగించాలని ఆమె పేర్కొన్నారు.

## రేనివట్లలో భూసంపత్తి రైతు ఉత్పత్తిదారుల సంస్థ సమావేశం



**మద్దూరు, ఆగస్టు 12(జనంసాక్షి):** రేనివట్ల గ్రామంలో భూసంపత్తి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతు వాటాదారుల సమావేశం నిర్వహించారు. గ్రామసభ ఆమోదంతో శంకర్‌ను సంస్థ బోర్డు డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాబోయే సీజన్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. సంస్థ చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ సంస్థ పరిధిలో ఇప్పటివరకు 1,022 మంది రైతులు వాటాదారులుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంస్థ మూడో వార్షిక సర్వసభ్య సమావేశాన్ని రేనివట్ల రైతు వేదికలో నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కొత్తగోళ్ల వెంకటేశ్, భగవంతు, సిద్ధప్ప, అశోక్‌గౌడ్, పవన్‌కుమార్‌రెడ్డి, చిన్న సాయప్ప, భద్రప్ప, దరికింది కనుకప్ప, ఆశన్పల్లి వెంకటప్ప, సవారి హనుమంతు, చిన్న నరసింహులు, జీ. రాజ్‌కుమార్, లాలాపా, అంజప్ప తదితర గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## 19న జరగబోయే ఉపాధ్యాయుల ధర్నాలో పెద్దఎత్తున పాల్గొనాలి



**గండీడ్,ఆగస్టు12 (జనంసాక్షి):** పాఠశాల విద్యారంగం, పాఠశాలలు,ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని,డిమాండ్ చేస్తూ..ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ)ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు కొనసాగుతున్నాయి.ఇందులో భాగంగా బుధవారం రెండో దశలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు.

గండీడ్ మండల తహసీల్దార్ రాజగోపాల్‌కు యూఎస్‌పీసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారం కోసం ఈనెల,19న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్నాను ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో(టీఎస్‌యూటీఎఫ్)జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్, మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు శేగ్గారి వెంకటయ్య,గండీడ్ మండల అధ్యక్షుడు గంట శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి పగిడ్యాల బోరు కృష్ణయ్య,ఉపాధ్యక్షుడు గోవిందుతో,పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గ్రంథాలయ పితామహుడు

## డాక్టర్ రంగనాథన్‌కు ఘన నివాళి



**న్యాల్‌కల్, ఆగస్టు 12(జనంసాక్షి):** జాతీయ గ్రంథాలయ దినోత్సవం, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ 134వ జయంతి సందర్భంగా కళాశాల సిబ్బంది, విద్యార్థునులు ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం న్యాల్ కల్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. జాతీయ గ్రంథాలయ దినోత్సవం, డాక్టర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ మేరీ లామ్, కేరళ విశ్వవిద్యాలయం గ్రంథాలయ సహాయకులు అమ్మాజీ రజిత జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థునులకు (డిజిటల్ స్క్రీన్) ద్వారా మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో ఉదయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ల కోసం తొలిరోజు 85 దరఖాస్తుల స్వీకరణ




**న్యాల్‌కల్, ఆగస్టు 12(జనంసాక్షి):** గత కొంతకాలంగా వితంతు పెన్షన్లు మినహా.. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు, డయాలసిస్, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు పింఛన్లు రాకకోసం ఎదురు చూశారు. ఎట్టకేలకు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం "చేయూత పెన్షన్ల"ను అందజేసేందుకు ఉత్తర్వులను జారీ చేయడంతో.. బుధవారం తొలిరోజు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 85గురు అభ్యర్థులు "చేయూత పెన్షన్ల" కోసం దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పలువురు అభ్యర్థులు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులను అందజేశారు. ఈనెల12న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ఈనెల 31వరకు యధావిధిగా కొనసాగనుంది.

# ఘనంగా ఆషాఢ బోనాల పలారం బండి ఊరేగింపు కార్యక్రమాలు..

- పాల్గొన్న మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్
- పటాన్‌చెరు ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్..



**పటాన్చెరు, ఆగస్టు 12(జనంసాక్షి):** పటాన్‌చెరు పట్టణంతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆషాఢ మాస బోనాల పండుగ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలారం బండి ఊరేగింపు కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు.
మంగళవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కౌన్సిలర్ మన్నే రాఘవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన పలారం బండి వేడుకలకు నీలం మధు ముదిరాజ్, కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పటాన్‌చెరు పట్టణంలో యాదవ సంఘం, ముదిరాజ్ సంఘం, గోకుల్ యూత్, గోనెమ్మ బస్తి, జూనియర్ బాయ్స్ యూత్ మరియు వివిధ కాలనీల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన పలారం బండ్ల ఊరేగింపుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ అని అన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను, యూత్ సభ్యులను ఆయన అభినందించారు.
ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి జిల్లా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, నాయకులు కాసాని వీరేష్, కౌన్సిలర్స్ గోపాల్ రెడ్డి, సంగన్నగారి గోపాల్, దస్తగిరి, సంపత్ రెడ్డి, వెంకటేష్ నాయక్, సందీప్ గౌడ్, నారాయణదాసు, మణికంఠ, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, యూత్ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహనా ర్యాలీ

- హెచ్ఐవి నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ హేమంత్ కేశవ్ పాటిల్



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 12 (జనంసాక్షి):** హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. బుధవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో హెచ్ఐవి ఎయిడ్స్ అవగాహన ర్యాలీనీ జెండా ఊపి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు12 తారీకు నుండి అక్టోబర్ 12 వ తారీకు వరకు జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో పట్టణ వార్డులలో ర్యాలీలు, స్కూల్స్, కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన, వకృత్వ పోటీలు, బైకు ర్యాలీలు, ఇంటింటికి వెళ్లి కరపత్రాల పంపిణీ చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. తదనంతరం బ్రేక్ ఫ్రీ అప్ ను ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరు సెల్ఫ్ రిస్క్ అసెస్మెంట్ బ్రేక్ ఫ్రీ అప్ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసిఅడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం వలనస్వయంగా తాము ఎంతవరకు హెచ్ఐవి సోకే అవకాశం ఉందో స్వయంగా అంచనా వేసుకోగలము. కావున ప్రతి ఒక్కరు ముఖ్యంగా యువత ఈ విధంగా సెల్ఫ్ అసెస్మెంట్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె కృష్ణ, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రఫీక్, డాక్టర్ కే రవికుమార్, డాక్టర్ కృష్ణమోహన్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ వాణి, జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాల చారి, డిపిఓ రేనయ్య, దిశా కార్యక్రమ మేనేజర్ రమేష్, పర్యవేక్షణ సిబ్బంది సుకుమార్ రెడ్డి, బాలాజీ, రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఐసిటిసి కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఎం ఆర్ డి ఎస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు, జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ ఐక్యత కోసమే కాంగ్రెస్ సద్భావన యాత్ర

- డిసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ రెడ్డి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 12(జనంసాక్షి):** మత సామరస్యం, సామాజిక ఐక్యతే రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్ర లక్ష్యమని నారాయ ణపేట డిసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నా రు.దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి బస్సు యాత్ర కర్ణాట క రాష్ట్రం రాయచూర్ నుంచి కృష్ణా బ్రిడ్జి మీదుగా తెలంగాణలోకి ప్రవేశించిన సందర్భంగా బుధవారం ఉదయం పది గంటలకు నారాయణపేట జిల్లా కాంగ్రె స్ పార్టీ అధ్యక్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వ ర్యంలో కృష్ణ బ్రిడ్జి టై రోడ్ వద్ద ఘన స్వాగతం పలి కారు. అనంతరం మాగనూరు, మక్తల్, ఉట్కూర్ మీదు గా నారాయణపేట జిల్లా కేంద్రంనికి చేరుకుంది. అంబెద్కర్, చిట్టెం.నర్సిరెడ్డి విగ్రహాలకు పూల మాలల తో నివాళులు అర్పించిన అనంతరం అక్కడి నుంచి జులాపూర్ బార్డర్ వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా డీసీసీ అధ్య క్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూరాజీవ్ గాంధీ దేశంలో మత సామ రస్యం, జాతీయ సమైక్యత, సామాజిక న్యాయం, సౌభ్రా తృత్వం కోసం కృషి చేసిన మహా నాయకుడు న్నారు. వారి శయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమేఈ సద్భావన జ్యోతి బస్సు యాత్ర ప్రధాన లక్ష్యంమ ని,మతం, కులం,ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విభే దాలు సృష్టించే ప్రయత్నాల ను తిప్పికొట్టి,ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి జీవించాలనే సందేశాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజలకు తెలియచేస్తున్నామన్నారు. దేశ అభివృద్ధికి శాంతి, సామ రస్యం, ఐక్యత ఎంతో అవసరం.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల హక్కు లు,రాజ్యాంగ విలువలు, లౌకికవాదం,సామాజిక సమానత్వం కోసం నిలబ డుతుందన్నారు. నేటి యువత రాజీవ్ గాంధీఆధునిక భారతదేశ స్వప్నాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో రాజీవ్ సద్భావన జ్యోతి యాత్ర కన్వీనర్ దోరై వేలు స్వామి,యాత్ర ప్రధాన కార్యదర్శి సుజేంద్ర శెట్టి,మార్కెట్ చైర్మన్ శివా రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం,అధికార ప్రతినిధి సంతోష్, మండల,పట్టణ అధ్యక్షులు కోట్ల.రవీందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, అనంద్,కౌన్సిలర్ రవితేజ, ఆర్టివో బోర్డ్ డైరెక్టర్ పోషల్ రాజేష్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల. మధుసూదన్ రెడ్డి, సీని యర్ నాయకులు ఎండి గౌస్,మనోహర్ గౌడ్, జొన్నల జయంత్ రెడ్డి, బోయశరణప్ప,యండి.ఖాజా,బాల్ రెడ్డి,మహిమూద్ ఖురేషి,పల్ల అనిల్,మాజీద్, రవికుమార్ గౌడ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# పలువురి మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు





**నంగునూర్, ఆగస్టు 12(జనంసాక్షి):** నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబ సభ్యులను బుధవారం రోజు మాజీ మంత్రి ఎమ్మెల్యే పరామర్శించడం జరిగింది. రాజగోపాల్పేట గ్రామానికి చెందిన సంతోష్ ట్రాక్టర్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాన్ని, పాలమాకుల గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ఎర్ర నాగరాజ్ తండ్రి ఎర్ర రామచంద్ర ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాన్ని, వెంకటాపూర్ గ్రామంలో తడక పల్లి మనోజ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాన్ని, అదే గ్రామానికి తడకపల్లి అంజయ్య మృతి చెందిన వారి కుటుంబాన్ని , జేపీ తండా గ్రామానికి చెందిన గణేష్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన వారి పాలూరి వృద్ధుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి అండగా ఉంటానని ధైర్యం చెప్పడం జరిగింది. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అనగోని లింగం గౌడ్, రాగుల సారయ్య రాగుల ఎడ్ల సోమిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు కోల రమేష్ గౌడ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు రేకులపల్లి సంతోష్ రెడ్డి,ఎల్లంకి మైపాల్ రెడ్డి, వేణు చక్రవర్తి, పలు గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేటలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 12(జనంసాక్షి):** నారాయణపేట పట్టణంలో బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. విద్యాసాగర్ సూచనలతో హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, నియంత్రణతో పాటు హెచ్ ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్షను నివారించేం దుకు నారాయణపేట జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ఇంటింటి సంద ర్శనలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలతో పాటు ప్రజల్లో హెచ్ఐవీ/ఎయి డ్స్‌పై అవగాహన కల్పిం చేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. జయచంద్ర మోహన్ జెండా ఊపి ర్యాలీని ప్రారం భించారు, ఈ ర్యాలీ ఆర్డీఓ కార్యాలయం నుండి పాత బస్టాండ్ సావర్కర్ చౌరస్తా వరకు కొనసాగింది, డా కే జయచంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రజలకు హెచ్ఐవీ వ్యాప్తి, నివారణ చర్యలు, సురక్షిత జీవన విధానంపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా, వారిని సామాజికంగా ఆదరించి, ఆరోగ్య సేవలు అందేలా సహకరించాలని ప్రజలకు సూచించారు. ఈ సంద ర్భంగా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సత్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, హెచ్ఐవీపై సరైన అవగాహన కలిగి ఉండటం, అపోహలను తొలగించడం, సకాలంలో పరీక్షలు చేయించుకోవడం, నివారణ చర్యలు పాటించ డం ద్వారా హెచ్ఐవీ వ్యాప్తిని నియంత్రిం చవచ్చని తెలిపారు. హెచ్ఐవీ పాజిటివ్ వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా వారికి మద్దతుగా నిలవా లని ప్రజలను కోరారు. ఈ యొక్క కార్యక్రమంలో డా. ఆర్. సత్య ప్రకాష్ రెడ్డి, డా. లక్ష్మీకాంత్, డా. కె. తిరుపతి, శ్రీ బి. శ్రీధర్ రెడ్డి, కోఆర్డినేటర్, శ్రీ సి. అశోక్, కోఆర్డినేటర్, కౌన్సిలర్ సుధాకర్, బృందం సభ్య డు కార్తిక్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేటలో ఎర్ర సత్యంకు ఘన నివాళి

**నారాయణపేట ఆగస్టు 12(జనంసాక్షి):**
దివంగత మాజీ ఎమ్మెల్యే ముదిరాజ్ జాతి రత్నం ఎర్ర సత్యం కు నారాయణ పేటలో ఆయన చిత్ర పటా నికి బుధవారం వర్ధంతి సందర్భంగా ముదిరాజ్ సంఘంనాయకులు,అభిమానులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడు తూ ఎర్ర సత్యం బడుగు బలహీన వర్గ ప్రజలకు అందించిన సేవాలు చిర స్మరణీయమని చిన్న పెద్ద బేధం లేకుండా పేదలకోసం ఓ నాయాకుడిగా కాకుండా ఓ సేవకునిలా రేయింబ వళ్ళు ఎనలేని సేవాలు అందించిన మహోన్నత నాయకుడని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు కాకర్ల భీమయ్య జిల్లా మత్యస్య కారుల సంఘం చేర్మెన్ కాంత్ కుమార్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్య క్షులు సరాఫ్ నాగరాజ్ అన్నారు. అనంతరం కాకర్ల భీమయ్య ముదిరాజ్ ఆధ్వ ర్యంలో పేదలకు పండ్లు పంపిణి చేశారు ఈకార్య క్రమంలొముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు మిర్చి వెంకటయ్య మార్కెట్ వైస్ చెర్మన్ కొనంగేరి హన్మంతు కౌన్స్ లర్ ఆపిరెడ్డి పల్లి రాము, మాజీ డిసిసిబి చేర్మెన్ చింత వెంకటయ్య, బిజెపి పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్, కాంగ్రెస్ అధి కార ప్రతి నిధి సంతోష్ కుమార్ ,టిడిపి నాయకు లు ఓం ప్రకాష్ ముదిరాజ్ ఆర్టిఎ మెంబర్ పోషల్ రాజేష్, సంజీవ్ ప్రకాష్ వెంకట్రాములు,పాండు, అశోక్ ,మారుతి, సిరి తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే గ్రామ కమిటీ అధ్యక్షుడిని ఎన్నుకుంటాం

• పూటకో పార్టీ రోజుకో చిట్కా



**శివ్వంపేట, ఆగస్ట్ 12(జనంసాక్షి):** పార్టీలో కష్టపడిన వారికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్‌ల ఆధ్వర్యంలో బీఆర్ ఎస్ పార్టీలో సముచిత స్థానం గుర్తింపు ఉంటుందని చండి సర్పంచ్ గైనిబైటి ప్రవీణ్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్య మంలో పాల్గొన్న నాయకులు పార్టీ మారలేదని, కొంతమంది స్వార్థ ప్రయోజనాలకోసం పూటకో పార్టీ రోజుకో చిట్కాతో పబ్బం గడిపే వారే పార్టీలు మారుతుంటారన్నారు. అలాంటి వారికి పార్టీలో గుర్తింపు అనేది ఉండదని, ఉద్యమంలో పాల్గొనని ఒకరిద్దరూ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ గురించి మాట్లాడటం అస్పష్టంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న గ్రామ కార్యకర్తల నుంచి వీలైనంత త్వరలోనేచండి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. పార్టీలో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సర్పంచ్ తెలియజేశారు. ఇతర పార్టీ నుండి వలస వచ్చి పార్టీలో చేరగానే పదవులు ఇచ్చిన కూడా పార్టీకి ద్రోహం చేస్తే ఉపేక్షించేదిలేదని ప్రవీణ్ గౌడ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# పెన్షన్లు, రేషన్‌కార్డులపై అధికారుల సమీక్ష

• మండల ప్రత్యేక అధికారి జగ్గనాయక్



**మల్దకల్, ఆగస్టు12(జనంసాక్షి):** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి జగ్గనాయక్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు, పాఠశాల విద్యార్థుల దుస్తులు, సెన్ సెస్, ఎస్ఐఆర్, ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ పనులతో పాటు ఇతర అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయరెడ్డి,వ్యవసాయ అధికారి రాజశేఖర్, ఎంపీఓ జాకీర్,తాసిల్దార్ రూప్సిరాణి, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ పరమేష్,ఏపీఎం భీమేష్ నాయుడు, ఏపీవో సుజాత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

• యూపీహెచ్‌సీ డాక్టర్ భరత్ కుమార్



**జడ్చర్ల, ఆగస్టు 12 (జనంసాక్షి):** వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జడ్చర్ల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్ బుధవారం సూచించారు. నీరు నిల్వ ఉండి కలుషిత మవ్వడం వల్ల ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే ప్రమాదముందని హెచ్చరించారు. కాచి వడపోసిన నీటిని లేదా క్లోరినేటెడ్ నీటిని మాత్రమే తాగాలని తెలిపారు. పరిసరాల్లో పాత టైర్లు, కుండలు, కొబ్బరి బోండాల చిప్పల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని, దోమల తెరలు వాడాలని కోరారు. వీధి తినుబండారాలు, నిల్వ ఉంచిన ఆహారం, కట్ చేసిన పండ్లు తినకుండా తాజా, వేడి ఆహారాన్నే తీసుకోవాలని సూచించారు. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం ద్వారా టైఫాయిడ్, విరోచనాల నుంచి రక్షణ పొందవచ్చని చెప్పారు. జ్వరం, చలి, ఒంటి నొప్పులు ఉంటే సొంత వైద్యం చేసుకోకుండా ప్రభుత్వ యూపీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలని, మున్సిపల్ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లి యాంటీ లార్వా చర్యలు చేపట్టాలని కోరారు.

# ఎస్ఈఈపిప్రోగ్రామ్‌పై అంగన్వాడీ టీచర్లకు శిక్షణ



**మల్దకల్, ఆగస్టు 12(జనంసాక్షి):** మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడీ టీచర్లకు ఎస్ ఈఈపిప్రోగ్రామ్ శిశు వికాస్నా యాప్ పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో గట్టు మండల స్పెషల్ ఆఫీసర్ అక్బర్ బాషా,గట్టు మండల ఎంపీడీవో చెన్నయ్య, మండల ప్రాజెక్టు సిడిపిఓ ఆకాశ దీప్తి,సూపర్వైజర్ వాసంతి,శిక్షణ ఫౌండేషన్ సీనియర్ మెంటర్ పల్లిదేవి, మెంటర్స్ గంగయ్య,రంగస్వామి, నరసింహులు,వినయ్, రంగస్వామి,రాజు,శ్రీశైలం, ప్రేమ్ రాజ్,రమేష్ పాల్గొన్నారు. ఎస్ ఈఈపి ప్రోగ్రామ్ శిశు వికాస్నయాప్ యొక్క ముఖ్య ఉద్దేశాలు,అమలు విధానం అంగన్వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించే విధానాలపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. శిక్షణలో మెంటర్స్ వివిధ అంశాలను వివరించి,టీచర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమం అంగన్వాడీ టీచర్లకు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చిన్నారుల సమగ్రమైన అభ్యసన,అభివృద్ధికి మెరుగైన సహకారం అందించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

# ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

• సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం
• తపస్ రాష్ట్ర కార్యదర్శి రమేష్



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 12(జనంసాక్షి):** ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తపస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. బుధవారం ఆరెసిపురం మండలంలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలో ఉపాధ్యాయులకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం లో సభ్యులుగా చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా క్రీడా సంస్కృత వివాహ విభాగం కొకన్వీనర్ సృజనకుమారి, ఆర్ సి పూర్ మండల శాఖ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ , ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి సరైంది కాదన్నారు. పి ఆర్సి గడువు ముగిసి మూడు సంవత్సరాలైనా రిపోర్ట్ తెప్పించుకొని ఫిట్మెంట్ ఇవ్వడం లేదని, ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆరు డిఏలు పెండింగ్ లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు క్లియర్ కావడం లేదని ఆయన అన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేస్తామన్న విషయాన్ని మర్చిపోడం ఏమిటని ప్రశ్నించారు. కేజీబీవీ పాఠశాలలు మోడల్స్ స్కూలు రెసిడెన్షియల్ స్కూలు సమస్యలు అలాగే ఉన్నాయి. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఉద్యమ కార్యాచరణ ప్రకటించి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 51 శాతం ఫిట్మెంట్ ఇవ్వాలని, కేజీబీవీ ఉపాధ్యాయుల సమ్మె కాలపు వేతనాన్ని ఇవ్వాలని ,వారికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలు ఇవ్వాలని ,విశ్రాంత ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రమేష్ తెలిపారు.

# సైబర్ నేరాలు,మూఢ నమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• చేర్యాల సీఐ బానోత్ రమేష్ నాయక్
• కాశగుడిసెలలో పోలీసుల కనువిప్పు కళా ప్రదర్శన



**చేర్యాల, ఆగస్టు 12(జనంసాక్షి):** రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సీఐ బానోత్ రమేష్ నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్, జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి పోలీస్ కనువిప్పు తెలంగాణ సాంస్కృతిక సారధి సంయుక్త ఆధ్వర్యంలో చేర్యాల మండలం కాశేగుడిసెలు గ్రామంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదాల నివారణ సైబర్ నేరాలపై డ్రగ్స్ నివారణ మూఢ నమ్మకాలపై పోలీస్ కనువిప్పు బృందం, తెలంగాణ సారధి కళా బృందం ద్వారా ప్రజలను చైతన్య పరచగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చేర్యాల సిఐ బానోత్ రమేష్ నాయక్ హాజరై మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు అని అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు అని ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. యువత బెట్టింగ్‌లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడవేయవద్దని కోరారు. చిన్నచిన్న విషయాలకు ఆత్మహత్య చేసుకుని జీవితాలు నాశనం చేసుకోవద్దని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరు హెల్మెట్ వాడాలని సూచించారు. యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని విలువైన జీవితాలు ఆగంచేసుకోవద్దని కోరారు. చేర్యాల ఎస్ఐ అపూర్వరెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు వారి పిల్లలకు బాధ్యత నేర్పించాలని ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 112 కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ ఆసియా బేగం అఖిల్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,కనువిప్పు బృందం బాలు,రాజు, తిరుమల,అశోక్, తెలంగాణ సాంస్కృతిక సారధి టీమ్ లీడర్ శ్యామ్, సాంస్కృతిక సారధి కవి గాయకులు పిన్నింటి రత్నం,సనువాల కనకయ్య, డ్యాక్టరేట్ పన్నీరు శ్రీనివాస్,గెంటే హరిప్రసాద్, ఎల్ల సిద్దులు,బందారు నర్సింలు,చెదిరి పద్మ, సల్ల మమత,తదితర కళాకారులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

# నవాబుపేట్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు:"అప్రమత్తతే రక్షణ"





**నవాబుపేట్, ఆగస్టు 12(జనంసాక్షి):** మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'సైబర్ నేరాల నివారణ – అవగాహన' అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నవాబుపేట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) మరియు స్థానిక సర్పంచ్ గారు హాజరై, జ్యోతి ప్రజ్వలనం చేసి సదస్సును ప్రారంభించారు. ఆన్‌లైన్ మోసాలపై ఎస్ఐ గారి హెచ్చరిక: ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) గారు మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరగాళ్లు రకరకాల మార్గాల్లో అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పార్ట్-టైమ్ ఉద్యోగాల పేరిట వచ్చే నకిలీ లింకులు, లోన్ యాప్‌ల వేధింపులు, ఓటీపీ (ఓటీపీ) షేరింగ్ ఫ్రాడ్స్, మరియు డిజిటల్ అరెస్ట్ ల పేరిట జరిగే బెదిరింపుల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్ ఎత్తవద్దని, ఎలాంటి బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పకూడదని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా మోసపోతే వెంటనే గోల్డెన్ అవర్‌లో (మొదటి గంటలో) జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని లేదా ఎఎవతీఓతీఅఎ.ఫ్రశీజ.అఐ పోర్టల్‌లో నమోదు చేయాలని వివరించారు.

అనంతరం గ్రామ సర్పంచ్ గారు మాట్లాడుతూ.. ఇలాంటి అవగాహన సదస్సులు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో అవసరమని కొనియాడారు. ముఖ్యంగా చదువుకోని వారు, వృద్ధులు మరియు మహిళలు ఈ సైబర్ నేరగాళ్ల బారిన పడి కష్టార్జితాన్ని కోల్పోతున్నారని ఆవేదన చెందారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్ వాడేటప్పుడు జాగ్రత్త వహించాలని, ఈ విషయాలను తమ ఇరుగుపొరుగు వారికి కూడా వివరించాలని కోరారు. గ్రామాన్ని సైబర్ నేర రహితంగా మార్చేందుకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలని సమ్మె నోటీసు: ఏఐటీయూసీ సురేష్

- మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు కాంట్రాక్ట్ ఎ కార్మికుల సమ్మె నోటీసు..
- ప్రభుత్వ హామీ కాగితాలకే పరిమితమా...?
- కార్మికుల న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలి...



మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఆగస్టు 12(జనంసాక్షి): మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు తమ పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వేతనాలు సకాలంలో అందకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు మరియు కార్మికుల సంఘం (ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని శానిటేషన్, పేషెంట్ కేర్, మరియు సెక్యూరిటీ విభాగాలకు చెందిన వందలాది మంది కార్మికులు ఈ నిరసనలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామన్న ప్రభుత్వ హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. గత కొన్ని నెలలుగా వేతనాలు నిలిచిపోవడంతో తాము కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని, నిత్యావసరాలు కొనుగోలు చేయడానికి మరియు ఇండ్ల అద్దెలు చెల్లించడానికి ప్రైవేట్ చేతిబదుళ్లు, అప్పులు చేయాల్సి వస్తోందని కార్మికులు పేర్కొన్నారు.ప్రధాన డిమాండ్లు:బకాయి ఉన్న పెండింగ్ వేతనాలను వెంటనే ఒకే విడతలో పూర్తిగా విడుదల చేయాలి.ప్రభుత్వ నిబంధనల (జీవో 60) ప్రకారం పెంచిన కనీస వేతనాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలి.ప్రతి నెల మొదటి తేదీనే వేతనాలు నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ అయ్యేలా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు . నోటీసు గడువు లోగా తమ సమస్యలను పరిష్కరించి, పెండింగ్ వేతనాలు విడుదల చేయకుంటే విధులను పూర్తిస్థాయిలో బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగుతామని కార్మికులు స్పష్టం చేశారు. దీనివల్ల ఆసుపత్రిలో రోగులకు జరిగే ఇబ్బందులకు మరియు సేవల అంతరాయానికి యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆసుపత్రి కాంట్రాక్ట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# వనదుర్గమ్మ సన్నిధిలో మంత్రి

పాపన్నపేట, ఆగస్టు 12(జనంసాక్షి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. బుధవారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అమ్మ వారిని దర్శించుకున్నారు. అర్చకులు మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా మెదక్ ఆర్డీవో రమాదేవి,స్థానిక సర్పంచ్ సుశీల దుర్గయ్య తదితరులు ఉన్నారు.

# నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



జడ్చర్ల, ఆగస్టు 12 (జనంసాక్షి): కావేరమ్మపేట శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు రుమాండ్ల పర్వతాలు, రుమాండ్ల సత్యనారాయణ, పద్మశాలి కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా పున్న కాశీ విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా మారేపల్లి శ్రీనివాసులు, ఎల్లా రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు శ్రీధర్, ఉప కార్యదర్శిగా చిక్క శ్రీనివాసులు, కోశాధికారిగా నక్క చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శులుగా చిక్క ఆంజనేయులు, గుత్తి అనంతయ్య, గోశిక మల్లేష్, ముఖ్య సలహాదారులుగా చిక్క రంగయ్య, చిక్క నాగేశం, చిక్క వెంకటయ్య, సంబారి బాలస్వామి, ఎల్లా హరిప్రసాద్, గుంత వెంకటరమణ ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. తమను ఎన్నుకున్న సంఘ పెద్దలకు, సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

# నవాబుపేటలో ఘనంగా ఎర్ర సత్యం అన్న 31వ వర్ధంతి వేడుకలు



నవాబుపేట, ఆగస్ట్ 12(జనంసాక్షి): మండల కేంద్రంలోని స్థానిక ఎర్ర సత్యం చౌరస్తాలో మాజీ జడ్చర్ల శాసనసభ్యులు, దివంగత నాయకులు ఎర్ర సత్యం (మరాఠీ సత్యనారాయణ) 31వ వర్ధంతి వేడుకలను అఖిల పక్ష నాయకులు అత్యంత ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా చౌరస్తాలోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. 'ఎర్ర సత్యం అన్న అమర్ రహే' అంటూ చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. మంచి వారికి కొండంత అండగా ఉంటూనే, చెడు చేసే వారిని, పేదలను వేధించే వారిని సింహంలా ఎదిరించడమే సత్యం అన్న శైలి.నేడు నవాబుపేట్ మండల కేంద్రంలో మరియు పాలమూరు వ్యాప్తంగా ఎందరో ప్రజా ప్రతినిధులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
సత్యమన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, ప్రజాసేవ నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల అఖిల పక్ష నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు, మరియు సత్యమన్న అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గుండె చికిత్సకు రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

- అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గుణగంటి స్వామికు అండగా నిలిచిన ఎమ్మెల్యే




వనపర్తి బ్యూరో, ఆగస్టు 12(జనంసాక్షి): గుండె సంబంధిత అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమ్మరి గుణగంటి స్వామి తండ్రి పెంటయ్యకు వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న రూ.2 లక్షల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంజూరు చేయించారు.స్వామి గుండె సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని కౌన్సిలర్ బొడ్డుపల్లి పరశురాం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి, ప్రభుత్వ పరంగా అందే రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరుకు చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రిని సందర్శించిన కౌన్సిలర్ బొడ్డుపల్లి పరశురాం, బొడ్డుపల్లి రవి, గుణగంటి లక్ష్మీనారాయణ, గుణగంటి లోకేష్, నాగపూర్ అంజి తదితరులు పెంటయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన వైద్య సహాయం అందించేందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని వారు తెలిపారు.

# బస్సు సౌకర్యం కల్పించండి



మిడ్జిల్, ఆగస్టు 12 (జనంసాక్షి): మండలంలోని మిడ్జిల్ నుండి వాడ్యాల. వేముల మసిగుండ్లపల్లి అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలో ఉన్న చెన్నంపల్లి వెంకటాపురం అంతారం మీదుగా వెల్జాల గ్రామ శివారులో రంగారెడ్డికి వెళ్లే బస్సు సౌకర్యం కల్పించాలని వివిధ గ్రామ ప్రజాప్రతినిధులు. ప్రజలు. విద్యార్థులు. కోరుచున్నారు. విద్యార్థులు చదువుకోడానికి మిడ్జిల్ మండల కేంద్రంలో ఉన్న హై స్కూల్ గాని జూనియర్ కళాశాలకు గాని వెళ్లడానికి ఉదయం పాఠశాల మరియు కళాశాలకు వెళ్లడానికి ఉదయం. సాయంత్రము తిరిగి ఇంటికి రావడానికి విద్యార్థులు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు. గోదా శ్రీశైలం. మంగమ్మ ఆంజనేయులు. చంద్రయ్య గౌడ్. కోరుతున్నారు ప్రభుత్వం చొరవ తీసుకొని విద్యార్థులకు ప్రయాణికులకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుచున్నారు ఈ రూట్లో హైదరాబాద్ వెళ్లడానికి ప్రయాణికులు అందుబాటులో ఉన్నారని ఈ రూటు బస్సు నడపడం వలన ఆర్టీసీకి గాని ప్రభుత్వానికి గాని లాభ దాయకంగా ఉంటుందని కోరుతున్నారు దయవుంచి పేద విద్యార్థులు చదువుకోవడానికి వీలు కల్పిస్తూ బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు

# ముగిసిన భగవద్గీత పారాయణం



నారాయణపేట, ఆగస్టు 12(జనంసాక్షి): నారాయణపేట శాంతినగర్ బ్రాహ్మణ వాడి శివాలయంలో గత మూడు నెలలుగా భగవద్గీత ప్రవచన పారాయణం నిర్వహించారు. బుధవారం ఈ కార్యక్రమం ముగింపు ఈ సభ నిర్వహించారు.ఈ సభకు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మంజుల జి ఆర్ రెడ్డి , భాజపా జిల్లా అధ్య క్షులు కొండ సత్య యాదవ్, కౌన్సిలర్లు శ్వేతా కృష్ణా రెడ్డి, కాకర్ల నారాయణమ్మ భీమయ్య, సత్య రఘు పాల్, శ్వేతా వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శులు తంగా శివా రెడ్డి,తంగా విశ్వనాథరెడ్డి నరసింహ చిల్లాల్ శివ చిల్లాల్ ,బాలాజీ గౌడ్, బాల్రాజ్ గౌడ్ ,బాలాజీ చిల్లాల్ గోనూర్ రఘు, రమాదేవి, సునీత, తంగా వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సద్భావన యాత్ర కు ఘన స్వాగతం

- ఐక్యత కోసమే యాత్ర ప్రశాంత్ రెడ్డి



కృష్ణ, ఆగస్టు 12 (జనంసాక్షి): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి బస్సు యాత్ర కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి కృష్ణా బ్రిడ్జి మీదుగా తెలంగాణలోకి ప్రవేశించిన సందర్భంగా బుధవారం ఉదయం పది గంటలకు నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కృష్ణ బ్రిడ్జి గుడేబల్లూర్, టై రోడ్ వద్ద ఘన స్వాగతం పలి కారు.
ఈ సందర్భంగా డీసీసీఅధ్య క్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశంలో మత సామరస్యం, జాతీయ సమైక్యత, సామాజిక న్యాయం, సౌభ్రా తృత్వం కోసం కృషి చేసిన మహా నాయకుడున్నారు.వారి శయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ సద్భావన జ్యోతి బస్సు యాత్ర ప్రధాన లక్ష్యమని,మతం, కులం,ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాల ను తిప్పికొట్టి,ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి జీవించాలనే సందేశాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజలకు తెలియచేస్తున్నామన్నారు.దేశ అభివృద్ధికి శాంతి, సామరస్యం,ఐక్యత ఎంతో అవసరం.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల హక్కు లు,రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామాజిక సమానత్వం కోసం నిలబ డుతుందన్నారు. నేటి యువత రాజీవ్ గాంధీ ఆధునిక భారతదేశ స్వప్నా న్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా డీసీసీ అధ్యక్షులు శ్రీ ప్రశాంత్ కుమార్ రెడ్డి,మండల అధ్యక్షులు విజప్ప గౌడ మాలిపాటేల్ , యువజన కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ సర్ఫరాజ్ , డీసీసీ కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు సోమసంతోష్,, కృష్ణ మండల వివిధ గ్రామాల సర్పంచులు , ఉపసర్పంచులు, పల్లే సురేష్, వార్డు సభ్యులు , మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు, పాల్గొన్నారు.

# అనేక వ్యాధులకు మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సలు




- సరైన సమయంలో సరైన చికిత్స పొందేందుకు ప్రజల్లో అవగాహన అవసరం

**మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 12 (జనంసాక్షి):** ఆధునిక వైద్య సాంకేతికత అభివృద్ధితో గతంలో పెద్ద శస్త్రచికిత్సలు అవసరమైన అనేక వ్యాధులకు ఇప్పుడు తక్కువ కోతతో మినిమల్లీ ఇన్వేసివ్ విధానాల్లో చికిత్స అందించే అవకాశాలు ఉన్నాయని యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డా.సంకేత్ కులకర్ణి తెలిపారు. మహబూబ్‌నగర్‌లో యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, యాంజియోగ్రఫీ వంటి ఇమేజింగ్ పద్ధతుల సహాయంతో చిన్న సూది గాటు లేదా సన్నని కాథెటర్ ద్వారా అనేక వ్యాధులను గుర్తించి చికిత్స చేయడం ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ప్రత్యేకత అని వివరించారు.

కాలేయ కణితులు, అంతర్గత రక్తస్రావం, రక్తనాళాల్లో అడ్డంకులు, పెరిఫెరల్ వాస్క్యులర్ వ్యాధులు, వెరికోస్ వెయిన్స్, గర్భాశయ ఫైబ్రాయిడ్లు, అబ్సెస్‌లు, పిత్తనాళాల వ్యాధులు, కిడ్నీ తదితర కణితులు, వివిధ రక్తనాళాల వ్యాధులకు ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ద్వారా చికిత్స చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.సరైన రోగులను ఎంపిక చేసిన సందర్భాల్లో మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సతో చిన్న గాటు, తక్కువ నొప్పి, తక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండాల్సి రావడం, త్వరగా కోలుకునే అవకాశం వంటి ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. అయితే ప్రతి రోగికి ఒకే విధమైన చికిత్స సరిపోదని, రోగి పరిస్థితిని బట్టి మందులు, ఇంటర్వెన్షనల్ చికిత్స, శస్త్రచికిత్స లేదా వీటి కలయికలో సరైన విధానాన్ని వైద్యులు నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.

**స్ట్రోక్‌లో ప్రతి నిమిషం కీలకం...**

స్ట్రోక్ విషయంలో ప్రజల్లో మరింత అవగాహన అవసరమని డా. సంకేత్ తెలిపారు. ముఖం, చేయి లేదా కాలు అకస్మాత్తుగా బలహీనపడటం, మొద్దుబారటం, మాట తడబడటం, మాట్లాడలేకపోవడం, నడకలో తడబడటం, సమతుల్యత కోల్పోవడం లేదా అకస్మాత్తుగా చూపు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలని సూచించారు.

"స్ట్రోక్‌లో ప్రతి నిమిషం చాలా ముఖ్యం మెదడులోని ప్రధాన రక్తనాళంలో రక్తం గడ్డకట్టిన కొంతమంది ఎంపిక చేసిన రోగుల్లో మెకానికల్ థ్రాంబెక్టమీ ద్వారా గడ్డను తొలగించి మెదడుకు రక్తప్రసరణను పునరుద్ధరించే అవకాశం ఉంది. అందువల్ల వీలైనంత త్వరగా సరైన స్ట్రోక్ చికిత్స అందించే ఆసుపత్రికి చేరుకోవాలి," అని అన్నారు.

తీవ్రమైన అంతర్గత రక్తస్రావాన్ని నియంత్రించడంలోనూ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఎంబోలైజేషన్ ద్వారా కాథెటర్ సహాయంతో రక్తస్రావం అవుతున్న రక్తనాళాన్ని గుర్తించి నియంత్రించవచ్చని, సరైన రోగుల్లో పెద్ద శస్త్రచికిత్స అవసరాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు.ప్రజల్లో ఇంటర్వెన్షనల్ రేడియాలజీపై అవగాహన పెరగడం ద్వారా సరైన రోగులకు సరైన సమయంలో తగిన చికిత్స అందే అవకాశం పెరుగుతుందని డా. సంకేత్ పేర్కొన్నారు. "చిన్న గాటు ద్వారా చికిత్స చేసే అవకాశం ఉన్నప్పుడు ఆ విషయం రోగికి తెలియాలి. శస్త్రచికిత్సను భర్తీ చేయడం మా ఉద్దేశం కాదు. ప్రతి రోగి పరిస్థితికి సరిపోయే అత్యుత్తమ చికిత్స అందించడమే లక్ష్యం," అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ మేనేజర్ బి.సుదర్శన్ రెడ్డి, రోహిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

### టీయూడబ్ల్యూజే (హెచ్-143)

## జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి

- టీయూడబ్ల్యూజే (హెచ్-143) ప్రింట్ మీడియా జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర రావు,
- ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 12 (జనంసాక్షి):** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--హెచ్-143) నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14న శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే (హెచ్-143) ప్రింట్ మీడియా జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర రావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలు, వారి సంక్షేమం, వృత్తిపరమైన ఇబ్బందులు, హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు హాజరై జర్నలిస్టుల సమస్యలు, యూనియన్ భవిష్యత్ కార్యాచరణ, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం తదితర అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారని వారు తెలిపారు. అందువల్ల జిల్లాలోని యూనియన్ ముఖ్య నాయకులు, సభ్యులు తప్పనిసరిగా సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

సమావేశానికి హాజరయ్యే నాయకులు, సభ్యులు ఈ నెల 14న ఉదయం 9:30 గంటలలోపు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌కు చేరుకోవాలని సూచించారు. సమావేశానికి ఎలాంటి ఆలస్యం లేకుండా సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి ప్రాంతాలకు చెందిన యూనియన్ జిల్లా బాధ్యులు తమ పరిధిలోని ముఖ్య నాయకులు, సభ్యులతో సమన్వయం చేసుకుని వారందరినీ సమావేశానికి తీసుకువచ్చే బాధ్యత తీసుకోవాలని చంద్రశేఖర రావు, ఖానాపురం ప్రదీప్ కోరారు. ప్రతి మండలం, నియోజకవర్గం నుంచి యూనియన్ నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సమన్వయం చేయాలని సూచించారు.జర్నలిస్టుల ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఈ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ప్రతి ఒక్కరూ సమయపాలనతో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. జిల్లా కమిటీ నాయకులు, బాధ్యులు, సభ్యులందరూ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి స్థాయిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు పొందవచ్చు



**మద్దూరు, ఆగస్టు12(జనంసాక్షి):** మద్దూరు పట్టణ కేంద్రంలోని ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చని కోఆర్డినేటర్ టీ. దాసు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదవకుండానే మధ్యలో చదువు ఆపేసిన వారు, ఇంటర్మీడియట్ చదవలేక చదువుకు దూరమైన వారు, గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి పూర్తి చేయని వారు, చదవడం, రాయడం వచ్చిన వారు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర అనివార్య కారణాలతో చదువును మధ్యలోనే ఆపేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా తిరిగి విద్యను కొనసాగించవచ్చని తెలిపారు. చాలా సంవత్సరాలుగా చదువుకు దూరమైన వారు కూడా చదువుకోవాలనే ఆసక్తి ఉంటే ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొంది పరీక్షలు రాసి పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్‌లో చదివి ఉత్తీర్ణులైన పలువురు విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పొందుతున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్ చదువు పూర్తి చేసి పదేళ్లు గడిచినా తిరిగి పరీక్షలు రాసి విద్యను కొనసాగించే అవకాశం ఉందని, వయోపరిమితి లేదని చెప్పారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు: 9701730724, 9440385145 నంబర్లను సంప్రదించాలని కోఆర్డినేటర్ టీ.దాసు సూచించారు.

## ఆగస్టు 13 నుంచి 'ఎఫ్‌ఎఫ్‌ఎస్' యాప్‌తోనే ఎరువుల పంపిణీ

- రైతులు ముందుగానే నమోదు చేసుకోవాలి
- మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయక్



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఎరువుల పంపిణీలో పారదర్శకత, క్రమబద్ధత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం ఆగస్టు 13 నుంచి ఉప్పునుంతల మండలంలో అమల్లోకి రానుందని మండల వ్యవసాయ అధికారి కోర్ర రమేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై రైతులకు ఎరువుల పంపిణీ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (ఎఫ్‌ఎఫ్‌ఎస్) యాప్ ద్వారా మాత్రమే జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు ఎరువులు అవసరమైన సమయంలో కాకుండా ముందుగానే యాప్‌లో నమోదు చేసుకుని తమ భూమి, పంట, అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేయాలని సూచించారు.

రైతులు తమ ఆండ్రాయిడ్ ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రైతు గుర్తింపు సంఖ్య లేదా ఆధార్ ద్వారా ఒకసారి వచ్చే సంకేత సంఖ్యతో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. భూమి వివరాలు కనిపించకపోతే రైతు భూ నమోదు వివరాలను సమకాలీకరించుకోవడం లేదా భూమిని నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. పంట, భూమి వివరాలు నమోదు చేసి ఎరువులు కావాల్సిన విక్రయ కేంద్రాన్ని ఎంపిక చేసుకుని దరఖాస్తు సమర్పిస్తే చతురస్ర సంకేతం (క్యూఆర్ కోడ్), టోకెన్ సంఖ్య వస్తాయని, వాటి ఆధారంగా ఎరువులు పొందవచ్చని వివరించారు.

రైతులు ముందుగానే నమోదు చేసుకోవాలి: ఎరువుల అవసరం ఏర్పడకముందే రైతులు ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని రమేష్ నాయక్ కోరారు. రైతు గుర్తింపు సంఖ్య, ఆధార్, మొబైల్ నంబర్, భూమి వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. యాప్ వినియోగంలో సందేహాలు లేదా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి లేదా ఎరువుల విక్రయ కేంద్రాలను సంప్రదించాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

## కార్యాలయ సాధనకు మిన్నంటిన మద్దతు

- రెండో రోజు సంతకాల సేకరణ



**జడ్చర్ల, ఆగస్టు 12(జనంసాక్షి):** కావేరమ్మపేటలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకై చేపట్టిన సంతకాల సేకరణకు విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా రెండో రోజు స్థానిక ప్రజలతో కలిసి సంతకాల సేకరణను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సాధన జాయింట్ యాక్షన్ కమిటీ మాట్లాడుతూ కావేరమ్మపేటలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలకు, చుట్టుపక్కల గ్రామాల వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ డిమాండ్‌కు ప్రజల నుండి ఊహించని రీతిలో మద్దతు లభిస్తోందని, స్వచ్ఛందంగా తరలివచ్చి సంతకాలు చేస్తున్నారని, సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని త్వరలోనే ప్రజా ప్రతినిధులకు, ఉన్నతాధికారులకు అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సాధన జాయింట్ యాక్షన్ కమిటీ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## చేర్యాలలో భారీ తిరంగా ర్యాలీ



**చేర్యాల, ఆగష్టు 12 (జనంసాక్షి):** హర్ ఘర్ తీరంగ అభియాన్‌లో భాగంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు చేర్యాల బిజెపి మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో భారీ తీరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బల్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి ఇంటింటిపై జాతీయ జెండా ఎగరేసి మన దేశ ఐక్యమత్యాన్ని ఇతర దేశాలకు చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్రా మహేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కాశెట్టి పాండు, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు,మన్నె సత్య వర్ధన్,ముచ్చంతల సిద్ధారెడ్డి,మండల ఉపాధ్యక్షుడు బయ్యారపు యాదగిరి,పట్టన ప్రదాన కార్యదర్శి మనీశ్,కొట్టే చంద్రమౌళి, బీజేవైఎం నాయకులు మనోజ్ కుమార్,ప్రవీణ్ పాల్గొన్నారు.

# పండుగ సాయన్న తరువాత ప్రజల మనసులో బ్రతికిన మహానాయకుడు ఎర్ర సత్యమన్న

• మంత్రి వాకిటి శ్రీహరి



**మహబూబ్‌నగర్ బ్యూరో ఆగస్టు 12 (జనంసాక్షి):** పండుగ సాయన్న తరువాత ప్రజల మనసులో చిరస్థాయిగా బ్రతికిన మహానాయకుడు ఎర్ర సత్యమన్న అని రాష్ట్ర క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నగరంలోని ఎర్ర సత్యం చౌరస్తా వద్ద ఎర్ర సత్యమన్న విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి కలిసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్టీఆర్ సారథ్యంలో జడ్చర్ల ఎమ్మెల్యేగా పనిచేసిన ఎర్ర సత్యం ప్రజలకు అందించిన సేవలు అమోఘమని కొనియాడారు.పండుగ సాయన్న నాడు పెద్దలను కొట్టి పేదలకు పంచినట్లు సత్యమన్న కాంపౌండ్ కు పోతే పేదవారికి న్యాయం జరిగేదని ఆయన గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం కృషి చేశారని, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత, సేవా భావం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఎర్ర సత్యం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని మంత్రి పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఎర్ర సత్యం గొప్ప ధైర్యశాలి, ప్రజల కోసం నిలబడిన నాయకుడని అన్నారు. ప్రజా సమస్యలపై నిర్భయంగా పోరాడిన ఆయన సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో ముందుకు సాగుతూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎర్ర సత్యం అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొని ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఎన్ పి వెంకటేష్, , మిథున్ రెడ్డి, వినోద్ కుమార్, హర్షవర్ధన్ రెడ్డి, , సాయిబాబా, నాయకులు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కరాటేతో విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, ఆత్మ విశ్వాసం పెరుగుతుంది

• ఎస్పీ డాక్టర్ జి.వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 12(జనం సాక్షి):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లో కూడా రాణించా లని, కరాటే సాధనతో శారీ రక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. ఆగస్టు 9న హైదరాబాద్ చంపాపేట్‌లో జపాన్ షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి జాతీయస్థాయి కరాటే పోటీల్లో నారాయణపేట జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొని అత్యు త్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా విద్యార్థులు 4 బంగారు పతకాలు, 3 వెండి పతకాలు,1కాంస్య పతకం సాధించి నారాయణపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిం చిన విద్యార్థులను, కరాటే మాస్టర్లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అభినందిం చి, ప్రశంస పత్రాలు, మెడ ల్స్ అందించి సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే క్రీడ లు, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. క్రీడా ప్రతిభను ప్రోత్సహిం చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని



జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహేష్, టోర్నమెంట్ ఇంచార్జ్ మహమ్మద్ సలీం, జిల్లా ప్రెసిడెంట్ అశోక్, అనిల్ కుమార్, మండలాల ఇన్చార్జిలు తాయప్ప, తేయ్యాబ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం వస్తే గర్భిణి స్త్రీ మృతి

• డాక్టర్ల నిర్లక్ష్యమని బంధువుల ఆరోపణ, ఆందోళన

**సంగారెడ్డి, ఆగస్టు 12 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణీ మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కూతురు ప్రాణాలు కోల్పోయిందని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన అనిత (33), భర్త శ్రీశైలంతో కలిసి నివసిస్తోంది. తొమ్మిది నెలల గర్భిణీ అయిన ఆమెను కుటుంబ సభ్యులు ఈ నెల 10వ తేదీన ప్రసవం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో 12వ తేదీ తెల్లవారుజామున 5 గంటల సమయంలో అనితకు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చాయని, అనంతరం ఆమె మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. అనిత మృతి విషయం తెలుసుకున్న బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి సరైన వైద్యం అందించకపోవడం, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే అనిత ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత వైద్యులు, వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కొంతసేపు ఆసుపత్రి ఆవరణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న సంగారెడ్డి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న బంధువులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు.

సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ మృతి పట్ల నాయకులు నిరసన, న్యాయం జరగాలని ఆందోళన ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట బైఠాయింపు, ఆందోళనను విరమింప చేసిన పోలీసులు, నిర్లక్ష్యం వహించిన డాక్టర్లపై విచారణ చేస్తాం, నిర్లక్ష్యం చేస్తే తప్పనిసరిగా యాక్షన్ ఉంటుంది. సంగారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్, వైద్యుల నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి: చంటి ప్రభు

సంగారెడ్డి జిల్లా, చౌటకూర్ మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన గర్భిణీ అనిత సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరిన అనంతరం మృతి చెందడం తీవ్ర విషాదకరమని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చంటి ప్రభు డిమాండ్ చేశారు.

అనిత మూడు రోజుల క్రితం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరినట్లు, అయితే



ఆసుపత్రిలో ఉన్న సమయంలో తగిన వైద్య సేవలు అందలేదని కుటుంబ సభ్యులు, బద్రిగూడెం గ్రామ యువకులు మరియు గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయాన్ని వారు చంటి ప్రభు గారి దృష్టికి తీసుకురావడంతో, సమాచారం అందిన వెంటనే ఆయన సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఆందోల్ అసెంబ్లీ లీగల్ సెల్ కన్వీనర్ కలాలి వినోద్ కుమార్ గౌడ్, బచ్చుకూడం ప్రవీణ్, మాణిక్యంతో పాటు చౌటకూర్ మండలానికి చెందిన యువకులు, బద్రిగూడెం గ్రామస్తులు మరియు పలువురు బీజేపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఘటనపై స్పందిస్తూ చంటి ప్రభు మాట్లాడుతూ, వైద్య నిర్లక్ష్యం జరిగిందనే ఆరోపణలపై ప్రభుత్వం వెంటనే నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తగిన పరిహారం మరియు న్యాయం అందించాలని డిమాండ్ చేశారు.

అదే సమయంలో, ఆందోల్ నియోజకవర్గానికి చెందిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గారి సొంత నియోజకవర్గంలోని ఒక దళిత మహిళ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన ఘటనపై ప్రభుత్వం మరియు మంత్రి వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని చంటి ప్రభు అన్నారు.

ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రాజీనామా చేయాలని చంటి ప్రభు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం



**మల్దకల్, ఆగస్టు 12 (జనంసాక్షి):** ఉపాధ్యాయులు, పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారంమల్దకల్ మండలం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్దకల్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు పి.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మల్దకల్ తహసీల్దార్ కార్యాలయం తహసిల్దార్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పిఆర్‌సి అమలు, పెండింగ్ బకాయిల చెల్లింపు, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం,సిపిఎస్ రద్దు–ఓపిఎస్ పునరుద్ధరణ, ఉపాధ్యాయుల బదిలీలు–పదోన్నతులు, ఖాళీ పోస్టుల భర్తీ, టెట్‌లో సర్వీస్ వెయిటేజీ తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కేజీబివి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు, జీవో 317 సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపేందర్,ఎస్.జయన్న, ప్రభాకర్,ఆనంద్ తదితర పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తరలింపు.. రెండు ట్రాక్టర్లు పట్టివేత

• అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తప్పవు: ఎస్సై కురుమూర్తి



**కల్వకుర్తి,ఆగస్టు 12(జనంసాక్షి):** కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కల్వకుర్తి పోలీసులు బుధవారం మధ్యాహ్నం కల్వకుర్తితిరుపతి బైపాస్ వద్ద పట్టుకున్నారు.ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులు,డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై కురుమూర్తి హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలించవద్దని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు సూచించారు. అక్రమ ఇసుక రవాణాపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై కురుమూర్తి స్పష్టం చేశారు.

# అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్ యాత్ర



**రామాయంపేట, ఆగస్టు 12 (జనంసాక్షి):** కల్లుగీత కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రత మరియు వృత్తి ఆధునీకరణే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న 'గీతన్నల చైతన్య యాత్ర'కు రామాయంపేటలో అపూర్వ స్పందన లభించింది. కేజీకేఎస్ (ఖ+ఖూ) ఆధ్వర్యంలో మానుకోట నుండి హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వరకు చేపట్టిన ఈ చారిత్రాత్మక బస్సు యాత్రకు మద్దతుగా బుధవారం రోజున రామాయంపేటలోని స్థానిక రేణుక మాత ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సమరసత సమావేశం నిర్వహించారు. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు హాజరై ప్రసంగించారు. రామాయంపేట పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు కన్నపురం కృష్ణ గౌడ్ మరియు గౌడ సంఘ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్న ఈ సభలో పలు కీలక అంశాలపై చర్చించారు. ?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రంలో దాదాపు 5 లక్షల గీత కార్మిక కుటుంబాలు ప్రకృతి ప్రసాదించిన కోటి తాటి, ఈత చెట్లపైనే ఆధారపడి జీవిస్తున్నాయని గుర్తుచేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో ఆధునిక మార్పులు తీసుకురావాలని, ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కామ్రేడ్ ధర్మభిక్షం, ఎస్.ఆర్. దాట్ల లాంటి త్యాగధనుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఆదిశిల క్షేత్రాన్ని దర్శించుకున్న యూబీఐ డీజీఎం



**మల్దకల్,ఆగస్టు 12(జనంసాక్షి):** జోగులంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని వెలిసిన శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని బుధవారంయుబిఐ డీజీఎం వెంకటేశ్వర్లు స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, అర్చకులు రవిఆచారి సాదరంగా స్వాగతం పలికారు.అనంతరం దేవాలయంలోని ప్రత్యేక పూజలు చేశారు.డీజీఎంకు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. అదేవిధంగా తహసిల్దార్ ఝాన్సీ రాణి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో యుబిఐ మేనేజర్ నరేష్,చంద్రశేఖరరావు, రాఘవేంద్రచారి,సీనియర్ అసిస్టెంట్ కరీం, రఘు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటమే సిపిఐ లక్ష్యం



**జడ్చర్ల, ఆగస్టు 12 (జనంసాక్షి):** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడటమే సిపిఐ లక్ష్యమని, కేంద్ర బిజెపి ప్రభుత్వం తన ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ డిమాండ్ చేశారు. బద్లావ్ జరూరి హై జన చైతన్య యాత్ర బుధవారం జడ్చర్లకు చేరుకున్న సందర్భంగా నిర్వహించిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలు, నిరుద్యోగం, రైతు సమస్యలు, ప్రభుత్వ రంగాల ప్రైవేటీకరణపై కేంద్ర వైఫల్యాలను నిరసించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీలు, ఇందిరమ్మ ఇండ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ భర్తీ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరమేష్ గౌడ్, బాగి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి అభివృద్ధికి సీఎంను నిధులు కోరిన ఎమ్మెల్యే కసిరెడ్డి

- **కల్వకుర్తి,ఆమనగల్ మున్సిపాలిటీలకు రూ.80 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన**
- **అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లు,గ్రామాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థకు రూ.50 కోట్లు కోరిన కసిరెడ్డి**



**కల్వకుర్తి,ఆగస్టు 12(జనంసాక్షి):** కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన పలు కీలక అంశాలపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ప్రతిపాదనలు సమర్పించారు.

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. ఆమనగల్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ పనుల కోసం మొత్తం రూ.80 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందులో ఆమనగల్‌కు రూ.30 కోట్లు, కల్వకుర్తి మున్సిపాలిటీకి రూ.50 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. నియోజకవర్గంలో నిరుపేదలు, లంబాడీ కుటుంబాలు అధికంగా ఉన్న నేపథ్యంలో అర్హులైన మరిన్ని కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేసేందుకు అదనంగా 2 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. గృహ అవసరం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ ఇళ్లను కేటాయించడం ద్వారా పేదలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.అదేవిధంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, గ్రామపంచాయతీల్లో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతులను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సమర్పించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు.

## అంబులెన్స్ లోనే.. ఆడబిడ్డ జననం..!

- **న్యాల్‌కల్ మండలానికి చెందిన తల్లి,కూతురు క్షేమం**



**న్యాల్‌కల్, ఆగస్టు 12, (జనంసాక్షి):** పురిటి నొప్పులతో ఆసుపత్రికి బయలుదేరిన ఓ గర్భిణీ 108 అంబులెన్స్ వాహనంలోనే పండంటి ఆడబిడ్డ జన్మించన సంఘటన జహీరాబాద్ పట్టణ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది.108 సిబ్బంది, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ మండలం, మామిడిగి గ్రామానికి చెందిన సౌమ్య బుధవారం రాత్రి గ్రామం నుండి ఆసుపత్రికి108 అంబులెన్స్‌లో బయలు దేరారు. జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో.. పట్టణ సమీపంలోని పాత చెక్ పోస్ట్ (ఆర్టిఏ) వద్దకు చేరుకోగానే పురిటి నొప్పులు అధికమవడంతో అంబులెన్స్ లోనే గర్భిణి 2.5 కేజీల బరువు గల ఆడపిల్లను జన్మనిచ్చింది. గర్భిణీకి తొలి కాన్పు కావడంతో 108 పైలట్ రవీందర్ గౌడ్ ఏమాత్రం భయాం దోళనకు గురికాకుండా సకాలంలో స్పందించి తల్లి, బిడ్డను కాపాడారు. పైలెట్ సకాలంలో స్పందించడం పట్ల కుటుంబీకులు అభినందిస్తూ, సంతోషం వ్యక్తం చేశారు.

# ఎక్సైజ్ శాఖ వాహనాల వేలం

- **13 వాహనాలు విక్రయం.. రూ.2.47 లక్షల ఆదాయం**





**కల్వకుర్తి,ఆగస్టు 12,(జనంసాక్షి):**కల్వకుర్తిప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ స్వాధీనం చేసుకున్న వాహనాలకు వేలం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి వి. వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో వేలం ప్రక్రియ కొనసాగింది. శాఖ స్వాధీనం చేసుకున్న మొత్తం 13 వాహనాలను వేలం ద్వారా విక్రయించారు. ఈ ప్రక్రియతో ప్రభుత్వానికి రూ.2,47,000 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.వాహనాల వేలం ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను వేలం వేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు, శాఖ పరిధిలోని కేసులకు సంబంధించిన వాహనాల విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ఈ వాహనాల వేలం కార్యక్రమం అధికారుల పర్యవేక్షణలో జరిగింది.ఈ కార్యక్రమంలో సీఐ జె.వెంకట్‌రెడ్డి,శాఖ సిబ్బంది జంగయ్య, జనార్ధన్రెడ్డి, మణిందర్, సిద్ధార్థ,అనిల్,చంద్రశేఖర్,తేజశ్రీ,సునీత, పాల్గొన్నారు.

# జాతీయ వాటర్‌పోలో పోటీలకు సంగారెడ్డి స్విమ్మర్ ఎంపిక

- **రహమాన్‌కు కోచ్ శేషుకుమార్ అభినందనలు**



**సంగారెడ్డి, ఆగస్టు12, (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రతిభావంతుడైన స్విమ్మర్ మొహమ్మద్ అబ్దుర్ రహమాన్ సిద్ధీఖ్ జాతీయ స్థాయి వాటర్‌పోలో పోటీలకు ఎంపికయ్యారు. ఆయన స్విమ్మింగ్ కోచ్ శేషుకుమార్ ప్రత్యేకంగా అభినందిస్తూ, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 11వ తెలంగాణ సబ్-జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్--2026 ఎంపిక ట్రయల్స్‌లో అబ్దుర్ రహమాన్ సిద్ధీఖ్ ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలోని అక్వాటిక్ కాంప్లెక్స్‌లో జూలై 25న జరిగిన ఎంపిక ప్రక్రియలో ఎంపికయ్యారు. 52వ జూనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్-2026 (వాటర్‌పోలో టీమ్)లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ జాతీయ స్థాయి పోటీలు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఉన్న ఐడిఏ ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ పూల్, పిప్లియాహానా స్క్వేర్ వేదికగా సెప్టెంబర్ 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రెటరీ ఉమేష్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల అబ్దుర్ రహమాన్ సిద్ధిఖీని కోచ్ శేషుకుమార్ అభినందించారు. క్రమశిక్షణతో కూడిన సాధన, పట్టుదల, నిరంతర శ్రమతోనే ఇలాంటి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణకు, సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయి వాటర్‌పోలో పోటీలకు ఎంపిక కావడం ద్వారా అబ్దుర్ రహమాన్ సిద్ధీఖ్ తన క్రీడా ప్రతిభకు మరో మైలురాయిని జోడించారు. రాబోయే పోటీల్లో విజయవంతంగా రాణించి మరిన్ని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని డివైఎస్ఓ ధనంజేయులు ఆకాంక్షించారు. తమ కుమారుడు జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన రెహమాన్ తల్లిదండ్రులు, ఈ విజయ ప్రయాణంలో కోచ్ శేషుకుమార్ అందించిన సహకారం, ప్రోత్సాహం, మార్గదర్శకత్వాన్ని ఎప్పటికీ మరువలేమని తెలిపారు.రహమాన్ జాతీయ స్థాయి వాటర్‌పోలో పోటీలకు ఎంపిక కావడంలో స్విమ్మింగ్ కోచ్ శేషుకుమార్ అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం ఎంతో కీలకమని రెహమాన్ తల్లిదండ్రులు పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా తమ కుమారుడికి క్రమం తప్పకుండా శిక్షణ అందిస్తూ, అతని ప్రతిభను గుర్తించి మరింత మెరుగ్గా రాణించేలా ప్రోత్సహించిన కోచ్ శేషుకుమార్‌కు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.కేవలం ఈతలో నైపుణ్యాన్ని పెంపొందించడమే కాకుండా, పోటీలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన వంటి లక్షణాలను జిల్లా స్విమ్మర్స్ లో పెంపొందించారని పేర్కొన్నారు.

# క్రషర్ యంత్రంలో పడి ఉద్యోగి మృతి!

- **బాలానగర్ మండలం ఉడిత్యాలలో విషాదం**



**బాలానగర్, ఆగస్టు 12(జనంసాక్షి):** బాలానగర్, ఆగస్టు 12: క్రషర్ యంత్రంలో పడి ఓ ప్రైవేటు కంపెనీ ఉద్యోగి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన సాయికిరణ్ (38) ఉడిత్యాలలోని ఎస్ఎన్ఆర్ కంపెనీలో గత కొన్ని నెలలుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం క్రషర్ యంత్రం వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు చేయి యంత్రంలో ఇరుక్కొని, అందులో పడిపోయినట్లు తెలిపారు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. వెంటనే సాయికిరణ్‌ను అంబులెన్స్‌లో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిసింది. మృతుడికి భార్య, రెండేళ్ల కుమార్తెతో పాటు 25 రోజుల పసిబాబు ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.



**అనుమతులపై అనుమానాలు...**

క్రషర్ కంపెనీ నిర్వహణకు సంబంధించి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నామని నిర్వాహకులు చెబుతున్నట్లు సమాచారం. అయితే కంపెనీకి అవసరమైన అనుమతులు లేవన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ప్రమాదానికి అసలు కారణాలు, కంపెనీకి ఉన్న అనుమతులపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలిపారు.

# ఆరుతడి పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి

- ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు.. వరి సాగుకు దూరంగా ఉండాలి
- ప్రాజెక్టుల నీటి లభ్యతను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలి : మంత్రులు










వనపర్తి బ్యూరో, ఆగస్టు 12 (జనంసాక్షి): ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులను ఆరుతడి పంటల సాగు వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం వనపర్తి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి జూరాల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్, కేఎల్ఐ, బీమా ప్రాజెక్టుల నీటి లభ్యతపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున డిసెంబర్ వరకు నీటి లభ్యతపై అనిశ్చితి ఉందన్నారు. వరికి బదులుగా మినుము, వేరుశనగ, ఆయిల్‌పామ్, కూరగాయలు వంటి ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని సూచించారు.
మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రాజెక్టులకు ఎంత నీరు వస్తోంది, ఎంత విడుదల చేస్తున్నారనే వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ రైతులకు ఆన్అండ్ఆఫ్ పద్ధతిలో నీటి విడుదలతో పాటు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, మహబూబ్‌నగర్ కలెక్టర్ కుష్బు గుప్త, నారాయణపేట కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, గద్వాల కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, నాగర్‌కర్నూల్ కలెక్టర్ హిమంత కేశవ్ పాటిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నిరుద్యోగంపై సమరభేరి

- కార్పొరేట్లపై 2% పన్ను వేస్తే ఉచిత విద్య, వైద్యం: సీపీఎం
- క్యాబినెట్ భేటీలో రేషన్ కార్డుదారులకు ఊరటనివ్వాలి: జాన్ వెస్లీ




మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 12(జనంసాక్షి): దేశంలోని బడా కార్పొరేట్ సంస్థలపై కేవలం 2 శాతం అదనపు పన్ను విధిస్తే, దేశంలో ఉన్న నిరుపేదలందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందించవచ్చని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ స్పష్టం చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి, కేవలం పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తూ పాలన సాగిస్తోందని విమర్శించారు. బడా వ్యాపారవేత్తల అనుకూల విధానాల వల్ల అనేక విదేశీ వేదికలపై భారతదేశం రాజీ పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాజ్యాంగ విరుద్ధమైన 'సర్' పేరుతో తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను పథకం ప్రకారం తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని హరిస్తోందని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.
మరోవైపు రాష్ట్రంలో ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈనెల 14న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో రేషన్ కార్డుదారులకు అదనపు లబ్ది చేకూరేలా కీలక నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న సంగారెడ్డిలో నిర్వహించే సభలో కేవలం స్మార్ట్ రేషన్ కార్డులు ఇచ్చి చేతులు దులుపుకుంటారా లేక ప్రజలకు ఏమైనా అదనపు సౌకర్యాలు కల్పిస్తారా అని ప్రశ్నించారు. పేద కుటుంబాల్లో ప్రతి ఒక్కరికి 10 కిలోల బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా అందజేయాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరుపై సీపీఎం ఆధ్వర్యంలో సమరశంఖం పూరిస్తున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద భారీ నిరసనలు, అలాగే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 31న అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# పాగుంట గ్రామంలో మడుగులను తలపిస్తున్న మురుగు నీరు

- పాగుంట గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తం
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- సాక్షాత్తూ పంచాయతీ కార్యాలయం ముందే నీరు నిలిచినా చూడని అధికారులు
- గ్రామసభలో విన్నవించినా కరువైన స్పందన.. గ్రామస్థుల ఆగ్రహం



కేటిదొడ్డి, ఆగస్టు12(జనంసాక్షి): మండలం పాగుంట గ్రామంలో రోడ్లపై నిలిచిన మురుగునీరుతో మడుగును తలపిస్తోంది. మురుగు నీరుకు తోడు ఇటీవల కురిసిన వర్షం నీరు ముందుకు వెళ్లడానికి వీలులేక రోడ్డుపై నిలిచిపో యింది. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే వాహన దారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. వాహనాలు వెళ్లే సమయంలో సమీపంలోని ఇళ్లలోకి మురుగునీరు పడుతున్నట్లు స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వారం రోజులుగా నీరు ని ల్వ ఉండడంతో దోమలు వృద్ధిచెంది విషజ్వరాలు ప్ర బలే అవకాశమున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులకు ఫిర్యాదు చేసిన రోడ్లపై నిలిచిన మురుగు నీరు సమస్యను పరిష్కరించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ సభలో వార్డు సభ్యులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందన కరువైందని గ్రామస్తులు వాపోతున్నారు.

**రోజులు తరబడి నిల్వ.. విషజ్వరాల భయం...**

**చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు...**

రోడ్డుపై నిలిచిన మురుగునీటి సమస్యపై గ్రామ పంచాయతీ కార్యదర్శికి, మండల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామసభలో వార్డు సభ్యులు సైతం ఈ తీవ్రమైన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా మురుగు వున్న మాట వాస్తవమే గ్రామస్తులు సహకరించడం లేదు రెండు రోజులలో సమస్య ను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- సిద్దిపేట అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్
- చుంచనకోటలో సీసీ కెమెరాల ప్రారంభం



చేర్యాల, ఆగస్టు 12(జనంసాక్షి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని సిద్దిపేట అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం చుంచనకోట గ్రామంలో సీసీ టీవీ కెమెరాలు ప్రారంభోత్సవానికి గ్రామ సర్పంచ్ గొరె శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి సిద్దిపేట జిల్లా అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చుంచనకోట పరిధిలో ప్రజల భద్రతను మరింత మెరుగుపరిచేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన కెమెరాల వల్ల నేరాలు గణనీయంగా తగ్గుతాయని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉన్నామనే భావన కలుగుతుందని తెలిపారు.? గ్రామాల ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలలో ఈ కెమెరాలను అమర్చడం ద్వారా 24 గంటలూ నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు లేదా దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను త్వరితగతిన పట్టుకోవడానికి, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడానికి ఈ విజువల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని హాజరైన పోలీస్ అధికారులు సూచించారు. స్థానిక వ్యాపారులు, ప్రజలు కూడా తమ ఇళ్లు, షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. గ్రామ రక్షణ కొరకు ఇంత మంచి కార్యక్రమము ఏర్పాటు చేసినందుకు సర్పంచ్ కి అభినందనలు తెలిపారు. గ్రామ సర్పంచ్ గొరె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒక్క సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమని వ్యాఖ్యానించారు. సీసీ కెమెరాల కోసం అడగగానే ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఘనంగా దాతలను సన్మానించారు. గ్రామం సీసీటీవీ కెమెరాల ఫుటేజీ నిఘాలో ఉందని తెలియజేశారు. ?ఈ కార్యక్రమంలో చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్, ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి, ఉప సర్పంచ్ వట్టిపల్లి ఆగయ్య, వీపీఓ రంగారెడ్డి, కార్యదర్శి రాంబాబు, వార్డు సభ్యులు మంద వెంకట్ రెడ్డి, వడ్లకొండ వెంకటేశం, శ్రీపతి కమలేష్, శీర్ల శ్రీకాంత్,కారోబార్ రమేష్ , స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ పాలకవర్గం, పోలీసు అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి: డీఎస్పీ లింగయ్య




నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 12(జనంసాక్షి): నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాలని నారాయణపేట డీఎస్పీ. ఎన్.లింగయ్య పోలీసు అధికారులకు సూచించారు.నారాయణపేట మక్తల్, కోస్గి సర్కిల్ పరిధిలోని పోలీసులకు డీఎస్పీ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశాన్ని డీఎస్పీ నల్లపు లింగయ్య నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లాలో నేరాల నియం త్రణపై ప్రత్యేక దృష్టి సారిం చాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించాలని అధికా రులకు ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై సమగ్రంగా సమీక్ష నిర్వ హించిన డీఎస్పీ, గ్రేవ్ మరియు నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిపై సీఐ లు,ఎస్సైలను అడిగి తెలు సుకున్నారు.దర్యాప్తు సమయంలో అనుసరిం చాల్సిన విధానాలు, సేకరిం చాల్సిన ఆధారాలు, కేసు దర్యాప్తులో పాటించాల్సిన ప్రామాణిక విధానాల గురిం చి అధికారులకు వివరంగా మార్గనిర్దేశనం చేశారు.ప్రతి కేసులో నాణ్యమైన దర్యా ప్తు ఉండాలని,ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ప్రకారం కేసులను ఛేదించా లని సూచించారు.కేసుల్లో శిక్షల శాతం పెంచేందుకు పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ దాఖలు వరకు ప్రతి దశను కూలంకషంగా పరిశీలించి పారదర్శకతతో దర్యాప్తు జరపాలని ఆదే శించారు.అక్రమ ఇసుక రవాణా,గంజాయి, గుట్కా, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి వాటి ని పూర్తిగా నిర్మూలించే దుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఫోక్సో, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద నమోదయ్యే కేసులు, ఇతర గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి 60 రోజుల్లో పు చార్జిషీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీసు అధికారి స్టేష న్ నిర్వహణతో పాటు పూర్తి స్థాయి దర్యాప్తు నైపు ణ్యాలు కలిగి ఉండాలని, కేసుల వివరాలను ప్రతిరో జు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీ కరించాలని సూచించారు.లాంగ్ పెండింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు.సైబర్ నేరా లు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియో గం వల్ల కలిగే దుష్పరిణా మాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్య క్రమాలను మరింత విస్తృతంగానిర్వహించాలని సూచించారు. మన గ్రామం, మన పోలీసు కార్యక్రమం లో పోలీసు వాల్ ఏర్పాటు చేయని గ్రామాలలో త్వరగా ఏర్పాటు చేయాల ని తెలిపారు.రాబోయే గణే ష్ పండుగ సందర్భంగా ముందస్తు చర్యలు తీసుకో వాలని తెలిపారు.ఈ సమా వేశంలో సీఐలు రామ్లాల్, సైదులు ఎస్ఐ లు అశోక్ బాబు, రాజు, నవీద్, రమేష్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# 3 లక్షల ఓట్లకుపై ' సర్ 'కత్తెర..!

**సంగారెడ్డి జిల్లాలో నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్...**

1.సంగారెడ్డి మొత్తం ఓట్లు 2,54,693, డిజిటలైజేషన్‌కు అందినవి 2,03,823 డిజిటలైజేషన్ కు అందనివి, 50,870,శాతం 80.03

2.నారాయణఖేడ్ మొత్తం ఓట్లు 2,36,579, డిజిటలైజేషన్‌కు అందినవి 2,08,197, డిజిటలైజేషన్‌కు అందనివి, 28,382 శాతం 88

3.జహీరాబాద్ మొత్తం ఓట్లు 2,82,398,డిజిటలైజేషన్‌కు అందినవి 2,31,686, డిజిటలైజేషన్ అందనివి 50,712, శాతం 82.04

4.అందోలు మొత్తం ఓట్లు 2,55,084,డిజిటలైజేషన్ కు అందినవి 2,22,527 డిజిటలైజేషన్ కు అందనివి 32,557, శాతం 87.24

5.పటాన్‌చెరు మొత్తం ఓట్లు4,28,682 డిజిటలైజేషన్‌కు అందినవి 2,89,815,డిజిటలైజేషన్ అందనివి 1,38,867, శాతం 67.61

# నేరాల దర్యాప్తులో వేగం పెంచాలి

- లాంగ్ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి
- విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలి
- డ్రంక్ డ్రైవ్‌పై ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించాలి
- 'నేను సైతం'తో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంస పత్రాలు
- బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి జిల్లా ఎస్పీ.డి.వి శ్రీనివాసరావు



**మెదక్ బ్యూరో, ఆగస్టు 12 (జనంసాక్షి):** జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టడంతో పాటు కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దర్యాప్తులో ఉన్న పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని సమీక్షించారు. ప్రతి కేసును నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు శిక్షపడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని, నేరాల నియంత్రణకు బ్లూకోల్ట్స్, నైట్ పెట్రోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను జియోట్యాగింగ్ చేయాలని తెలిపారు. రోడ్డు భద్రతలో భాగంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, ఓవర్‌లోడ్ వాహనాలపై కూడా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. సీసీటియన్‌ఎస్, ఈ-సాక్ష్య, అప్లికేషన్లలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐ లు మహేష్, రేణుక, వెంకట రాజా గౌడ్, సైదా, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, రంగా కృష్ణ, ఎసై లు సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ సభ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి



**సంగారెడ్డి, ఆగస్టు 12 (జనంసాక్షి):** ఈ నెల 15 న సంగారెడ్డి లో సిఎం రేవంత్ రెడ్డి సభ నేపథ్యంలో సంగారెడ్డి పట్టణం లోని ఐబీ గెస్ట్ హౌజ్‌లో పోలీస్ అధి కారులు, ముఖ్య నాయకులతో జగ్గారెడ్డి, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. సీఎం సభకు జన సమీకరణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు.

**ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ...** సీఎం ఐఐటీ లోని హెలిప్యాడ్ నుండి బయలుదేరి నేరుగా ఐబీ చౌరస్తా వద్దకు చేరుకుంటారని అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రూ, రాజీవ్ గాంధీ ల విగ్రహాలను ఆవిష్కరిస్తారు అని తెలిపారు. అనంతరం సీఎం మాట్లాడేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

ఉమ్మడి జిల్లా నుండి వచ్చే లబ్ధిదారులు, కాంగ్రెసు నాయకులు కార్యకర్తల వాహనాల కోసం గంజి మైదాన్, మెడికల్ కాలేజీ లో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేలు, మంత్రుల వాహ నాలను డీఈవో కార్యాలయంలో పార్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. ఒక్క సంగారెడ్డి నియోజకవర్గం నుండి నలభై నుండి యాభై వేలమంది ని సభ కు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. అధికారులు ఇరవై వేల మంది లబ్ధిదారులను తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నారాయణ్ ఖేడ్ నుండి ఐదువేలు , ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఇతర ప్రాంతాల నుండి కలుపుకుని మొత్తం లక్షమందిని సభ కు తరలించేలా ప్లాన్ చేస్తున్నట్లు జగ్గారెడ్డి, సంజీవ రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులురఘు గౌడ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోక్సో కేసుల్లో నిందితులకు వరుస కఠిన శిక్షలు




**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 12(జనంసాక్షి);** ఫోక్సో కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా సమర్థవంతమైన వాదనలు వినిపించి, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేసిన ప్రాసిక్యూషన్,కోర్టు సిబ్బందిని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అభినందించారు. అలంపూర్,రాజోళి, శాంతినగర్, కేటీ దొడ్డి పోలీస్ స్టేషన్లలో నమోదైన ఫోక్సో కేసుల్లో గడచిన రెండు నెలల వ్యవధిలో నిందితులకు వరుసగా 20, 20, 10, 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షలు పడేలా కేసులను సమర్థవంతంగా కోర్టులో నడిపించారు. ఈ కేసుల్లో ఫోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. విజయ్ కుమార్ పటిష్టమైన వాదనలు వినిపించి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేశారు. అదేవిధంగా డి జె కోర్టు పీపీ పి. శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అదనపు పీపీ జె. సుగుణ దేవిలను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు శాలువాలు, పూలదండలతో సన్మానించి అభినందించారు.

**సాక్షుల హాజరులో కీలకంగా కోర్టు సిబ్బంది...**

కేసుల దర్యాప్తు పూర్తయిన అనంతరం కోర్టు విచారణలో సాక్షులను సకాలంలో హాజరుపరచడం, కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించడం, ప్రాసిక్యూషన్ అధికారులతో సమన్వయం చేయడంలో కోర్టు పీసీలు, లైజన్ అధికారులు కీలక పాత్ర పోషించారు. సాక్షులు విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటూ కేసుల విచారణ సజావుగా సాగేలా వారు చేసిన కృషిని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

లైజన్ ఆఫీసర్ ఎస్సై జిక్కిబాబు, హెడ్ కానిస్టేబుళ్లు పరమేష్, సాయిబాబా, శ్రీధర్, భరోసా సిబ్బంది, కోర్టు డ్యూటీ అధికారులు సమన్వయంతో పనిచేసి కేసుల విచారణలో ముఖ్యమైన పాత్ర పోషించారని ఎస్పీ పేర్కొన్నారు.

ఫోక్సో కేసుల్లోను, ఇతర కేసులలోనూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్, కోర్టు పీసీలు, లైజన్ అధికారులు సమన్వయంతో ఇంకా బాగా పనిచేయాలని ఎస్పీ టి. శ్రీనివాసరావు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె. శంకర్,గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, డి సి ఆర్ బి ఎస్సై, లైజన్ ఆఫీసర్ జిక్కిబాబు ఎస్సై, హెడ్ కానిస్టేబుళ్లు పరమేష్, సాయిబాబా, శ్రీధర్, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

# సిద్దిపేట ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన ఉదయ్ నాగరాజు: మాజీ మంత్రి హరీశ్ రావు



బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌కు ఎన్నికైన సిద్దిపేట బిడ్డకు ఘనంగా పౌర సన్మానం

సిద్దిపేట బ్యూరో(జనంసాక్షి): బ్రిటన్ పార్లమెంట్ హౌస్ ఆఫ్ లార్డ్స్ కు ఎన్నికైన సిద్దిపేట ముద్దుబిడ్డ ఉదయ్ నాగరాజు పౌర సన్మాన కార్యక్రమం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ఉదయ్ నాగరాజును శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఉదయ్ నాగరాజు తన పేరుకు తగ్గట్లే సార్థకత తీసుకొచ్చారని, తెలంగాణలో ఉదయించి బ్రిటన్‌లో వెలుగొందుతున్నారని ప్రశంసించారు.

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికైన మొట్టమొదటి వ్యక్తి ఉదయ్ నాగరాజే అని, కేవలం 47 ఏళ్ల చిన్న వయసులోనే ఆ దేశ చట్టసభకు ఎన్నికైన తొలి భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం అన్నారు.

ఒక చిన్న పల్లెటూరులో పుట్టి, బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికయ్యే స్థాయికి ఎదగడం వెనుక ఆయన అపారమైన కృషి, పట్టుదల ఉన్నాయన్నారు. కలలు కనాలి, వాటిని సాకారం చేసుకోవాలి అనడానికి ఉదయ్ జీవితమే ఒక ఉదాహరణ అని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి మనిషిలో ఒక అద్భుతమైన సామర్థ్యం ఉంటుందని, దానిని వెలికితీసి కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఉదయ్ నాగరాజు గారితో తనకు రెండున్నర దశాబ్దాల అనుబంధం ఉందని హరీశ్ రావు గుర్తుచేసుకున్నారు. ఆయన వివాహానికి కూడా తాను హాజరయ్యానని, ఆయన ఎంపీ కాకముందు లండన్ లోని వారి ఇంటికి కూడా వెళ్లానని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడ మనమంతా ఎలాగైతే పోరాడామో, లండన్ లో ఉంటూ ఉదయ్ నాగరాజు గారు కూడా మాతృభూమి కోసం ఉద్యమానికి అంతే స్థాయిలో మద్దతు తెలిపి, తన వంతు భాగస్వామ్యం అందించారని కొనియాడారు. ఖండాంతరాలు దాటి ఎంత ఎదిగినా ఆయన ఒదిగి ఉండే తత్వం అందరికీ ఆదర్శం అన్నారు. లండన్ లో ఉంటున్నప్పటికీ వారి అమ్మాయి అక్కడ భరతనాట్యం, కూచిపూడి నేర్చుకుంటోందని, వారు ఎంతో దూరంలో ఉన్నా మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను మరువకుండా పాటిస్తుండటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

ఎక్కడ ఎన్నికైనా ప్రజల కోసమే పనిచేస్తామని, అందరూ బాగుండాలని కోరుకునే గొప్ప వ్యక్తిత్వం తెలంగాణ ప్రజల సొంతం అన్నారు.

ఉదయ్ నాగరాజు గారికి సన్మానం చేయడం అంటే సిద్దిపేట ప్రజలకు, తెలంగాణకే కాకుండా యావత్ భారతీయులకు గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో బ్రిటన్ లో ఆయన మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని, అక్కడి ప్రజలకు గొప్ప సేవలు అందించాలని మనసారా కోరుకుంటూ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని హరీశ్ రావు ఆకాంక్షించారు.